గురువారం
03-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 103
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

'గడియారం' కోసం పవార్ న్యాయపోరాటం

ముంబై : మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ... నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ న్యాయపోరాటం చేపట్టారు. ఎన్నికల్లో అజిత్ వర్గం 'గడియారం' గుర్తును వినియోగించకుండా నిరోధించాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఓటర్లలో గందరగోళాన్ని సృష్టించకుండా అజిత్ పవార్ వర్గం కొత్త గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని పిటిషన్‌లో కోరారు. ఎన్నో ఏళ్ల పాటు ఎన్‌సీపీ అధ్యక్షుడిగా వ్యవహరించిన శరద్ పవార్... ఆ పార్టీ, గుర్తు (గడియారం) తో తనకున్న అనుబంధాన్ని వెల్లడించారు. ఇటీవల పార్లమెంటరీ ఎన్నికల సమయంలో ఓటర్లలో నెలకొన్న గందరగోళాన్ని ఆయన పిటిషన్‌లో ప్రస్తావించారు.

ఐరాస ప్రధాన కార్యదర్శిపై ఇజ్రాయిల్ నిషేధం

టెల్అవీవ్: హెజ్బుల్లా, హమాస్ అగ్రనేతలను అంతమొందించిన ఇజ్రాయిల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించడం ఆ ప్రాంతంలో అగ్గిరాజేసింది. వీటిని తీవ్రంగా పరిగణిస్తోన్న నెతన్యాహు ప్రభుత్వం... దీనికి ఇరాన్ తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించింది. ఈ క్రమంలో ఇరాన్ దాడిని ఖండించని వారెవరికైనా తమ దేశంలో అడుగుపెట్టే అర్హత లేదని స్పష్టం చేసింది. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో

- మిగతా 2 లో

రూ.2 వేల కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం

న్యూఢిల్లీ : దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దేశ రాజధాని నగరం ఢిల్లీలో భారీగా డ్రగ్స్ బయటపడటం కలకలం రేపుతోంది. దాదాపు 500 కిలోలకు పైగా కొకైన్‌ను ఢిల్లీ పోలీసులు సీజ్ చేశారు. వీటి విలువ రూ.2 వేల కోట్లు ఉంటుందని అంచనా. దక్షిణ ఢిల్లీలో సోదాలు జరిపిన పోలీసులు ఈ భారీ డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నలుగురిని అరెస్టు చేశారు. ఈ భారీ కొకైన్ తరలింపు

- మిగతా 2 లో

10న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 10వ తేదీ ఉదయం 11 గంటలకు వెలగపూడి సచివాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీజేశారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో అనేక కీలక నిర్ణయాలకు మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలపనుంది. ప్రధానంగా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు

- మిగతా 2 లో

చెత్త పన్ను ఇక రద్దు

- 2029 నాటికి స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యం
- శుభకార్యం రోజున ఓ మొక్క నాటండి
- 2025 డిసెంబర్‌కల్లా బందరు పోర్టు నిర్మిస్తాం
- దీపావళి నుంచి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ
- మచిలీపట్నం వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు
- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చెత్తపై గత ప్రభుత్వం వేసిన పన్నును పూర్తిగా రద్దు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మచిలీపట్నంలో సీఎం పర్యటించారు. విద్యార్థులతో కలిసి చెత్త ఊడ్చారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కూర్చుని స్వయంగా తేనీటిని అందించి కాసేపు ముచ్చటించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. సమైక్యరాష్ట్రంలో 1998లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించామని, ఇది తన మనసుకు దగ్గరగా ఉంటుందన్నారు. 2015లో మన రాష్ట్రంలో స్వచ్ఛ ఏపీకి శ్రీకారం చుట్టాం. 2019కి ముందు పట్టణాల్లో డివైడర్లకు రంగులు వేసి, పార్కులు అభివృద్ధి చేశాం. కానీ 2019లో భూతం వచ్చి వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు. గత పాలకుల నిర్వాకం కారణంగా రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త కుప్పలుగా ఉంది. 365 రోజుల్లో ఆ చెత్తంతా తొలగించాలని మంత్రి నారాయణను ఆదేశిస్తున్నా. చెత్తపై పన్ను వేశారు తప్ప...చెత్త తొలగించలేదు. ఇకపై ప్రతి రోజూ విధిగా చెత్త తొలగిస్తాం. టెక్నాలజీ ఉపయోగించి భవిష్యత్తులో ఎక్కడా చెత్త లేకుండా చేస్తామని చెప్పారు.

మెడికల్ కాలేజీకి పింగళి వెంకయ్య పేరు

'జాతీయోద్యమంలో మహాత్మాగాంధీ దేశమంతా కదిలించారు... అహింస పద్ధతిలో పోరాడారు. ఆయన సిద్ధాంతాలు భావితరాలకు ఆదర్శం. గాంధీ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తున్నామంటే అందుకు కారణం ప్రజాహితమైన ఆయన ఆలోచనలే. 1919లో గాంధీజీ మొదటిసారి కృష్ణా జిల్లాలో నిర్వహించిన సత్యాగ్రహ సభలో పాల్గొన్నారు. 1921లో అఖిల భారత మహాసభల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో ఈ గడ్డపై పుట్టిన పింగళి వెంకయ్య తాను రూపొందించిన జాతీయ జెండాను గాంధీజీకి అందించారు. స్వాతంత్ర్య ఉద్యమం, పోరాటంలో పింగళి వెంకయ్య ముందుండి పోరాడారు. ప్రతి భారతీయుడు సగర్వంగా చెప్పుకునే శక్తి ఇచ్చిన పింగళి వెంకయ్య ఈ గడ్డపై పుట్టిన వ్యక్తి కావడం మనందరికీ గర్వకారణం. స్వాతంత్ర్య పోరాటానికి ఊతమిచ్చిన ప్రాంతమిది. ఆంధ్ర జాతీయ కళాశాలలో ఎందరో మహానుభావులు విద్యనభ్యసించారు. కానీ కొందరు స్వార్థపరులు ఆ కాలేజీని కబ్జా చేయాలని చూశారు. మహనీయుల స్ఫూర్తిని కాపాడతాం. ఆంధ్ర జాతీయ కళాశాలను ప్రభుత్వ అధీనంలో నిర్వహిస్తాం. ఇక్కడి మెడికల్ కాలేజీకి పింగళి వెంకయ్య పేరు పేరు పెడతామని చెప్పారు.

దీపావళి నుంచి మూడు సిలెండర్లు ఉచితం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దీపావళి నుండి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. నా చిన్నతనంలో మా తల్లి వంటగదిలో పడిన కష్టాలు చూశాను. నా తల్లి పడిన కష్టం ఏ ఆడబిడ్డ పడకూడదని ఆలోచించి దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ పథకానికి గతంలో శ్రీకారం చుట్టాను. ఇప్పుడు పెరిగిన ధరల దృష్ట్యా పేదలకు మూడు సిలెండర్లు ఉచితంగా ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. 2027 నాటికి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత మంచి నీళ్లిస్తాం. జల్ జీవన్ మిషన్ పథకానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం వినియోగించలేదు. మూడేళ్లలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ నీరందే లక్ష్యంతో ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం. 2025 నాటికి ప్రతి గ్రామంలో ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. 2029 నాటికి అవసరమైన చోటల్లా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం. పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తాం. ప్రతి ఒక్కరూ మీ పుట్టిన రోజు నాడు లేదా శుభకార్యం రోజున ఒక చెట్టు నాటండి. చెట్టు నాటడం మన నాగరికత. రెండేళ్లలో పోలవరం పూర్తి చేసి, అమరావతి రాజధానిని కూడా నిర్మిస్తామని సీఎం చెప్పారు.

2025 నాటికి బందరు పోర్టు నిర్మాణం పూర్తి

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్మాణ పనులు నిల్చిపోయిన బందరు పోర్టును 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. బందరు పోర్టు పూర్తైతే ఇక్కడి వాసులకు అనేక లాభాలు కలుగుతాయి. బందరు నుండి రేపల్లెకు రైల్వే లైను ఏర్పాటుకు చొరవ తీసుకుంటాం. మచిలీపట్నంలో డ్రెయినేజీ 100 శాతం మంచిగా ఉండేలా చేస్తాం. మచిలీపట్నం బీచ్‌ను స్వదేశీ దర్శనం పథకం కింద

- మిగతా 2 లో

గోదుమ ధరలకు రెక్కలు

పండుగలకు ముందు ప్రజలకు షాక్

న్యూఢిల్లీ : అధిక ధరల కారణంగా దేశ ప్రజలు జీవనం సాగించడం కష్టతరంగా మారింది. నిత్యావసర వస్తువుల ధరలు తారస్థాయికి చేరిపోయాయి. పప్పులు, వంట నూనె ధరలు భారీగా పెరగడంతో ప్రజలు పండుగలను సంతోషంగా చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. యావత్ దేశవ్యాప్తంగా పండుగల సందడి మొదలైంది. ఈ నెల 12న విజయదశమి, నెలాఖరులో దీపావళి వేడుకలు జరుగనున్నాయి. ఆ తర్వాత పెళ్లిళ్ల సీజన్ సైతం ప్రారంభం కానున్నది. ఈ పండుగలకు ముందు గోదుమల ధరలు పెరుగుతున్నాయి. గోదుమలపై ప్రభుత్వం నియంత్రణ ఉన్నా పెరుగుతూ వస్తున్నది. ప్రభుత్వం పరోక్షంగా నిల్వలపై పరిమితి విధించింది. వ్యాపారులు ఎప్పటికప్పుడు నిల్వలపై సమాచారం అందించాలని కేంద్రం ఆదేశించింది. ఇదిలాఉండగా, రెండు నెలల్లో గోదుమల ధర క్వింటాల్‌కి రూ.200 పైగా పెరిగింది. ఢిల్లీ హోల్‌సేల్ మార్కెట్‌లో గోదుమలు క్వింటాల్‌కు రూ.3,100 దాటింది. ఈ పరిస్థితుల్లో గోదుమ పిండితో తయారయ్యే బ్రెడ్, మఫిన్స్, నూడుల్స్, పాస్తా, బిస్కెట్లు, కేకులు, కుకీలు తదితర ఉత్పత్తులపై ధరల ప్రభావం కనిపించే అవకాశం అందని వ్యాపారులు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో గోదుమల ధరలు మరింత పెరుగుతాయని చెబుతున్నారు. మార్కెట్‌లోకి దిగుమతులు రాకపోతే దీపావళి నాటికి క్వింటాల్‌కి రూ.3,500 దాటుతుందని అంచనా. పెళ్లిళ్ల సీజన్‌లో గోదుమల ధర క్వింటాల్‌కు రూ.4 వేలు దాటుతుందని భావిస్తున్నారు. ఎందుకంటే దిగుబడులు వచ్చేందుకు ఇంకా సమయం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఏడాది పొడవునా గోదుమ ధరలను నియంత్రించడానికి, బహిరంగ మార్కెట్ విక్రయం ద్వారా కనీసం 100 లక్షల టన్నుల గోదుమలను మార్కెట్లోకి విడుదల చేయాలి. దేశంలో గోదుమ నిల్వలను పరిశీలిస్తే... ఏప్రిల్ 1 నాటికి దాదాపు 75 లక్షల మెట్రిక్ టన్నుల గోదుమలు ఉన్నాయి.

ఇది బఫర్ స్టాక్ కంటే కొంచెం ఎక్కువ. కాగా, ఈ ఏడాది ప్రభుత్వం 266 లక్షల మెట్రిక్ టన్నుల గోదుమలను కొనుగోలు చేసింది. వీటిని కలిపితే ప్రభుత్వ సేకరణ ముగిసిన తర్వాత ప్రభుత్వం వద్ద 340 లక్షల మెట్రిక్ టన్నుల గోదుమలు నిల్వ ఉన్నాయి. ప్రభుత్వ రేషన్ పంపిణీకి 185 లక్షల మెట్రిక్ టన్నుల గోదుమలు అవసరం ఉంటుంది. ప్రభుత్వం వద్ద 155 లక్షల మెట్రిక్ టన్నుల గోదుమలు అదనంగా నిల్వ ఉన్నట్లు సమాచారం.

మద్యం దుకాణాల పెంపు దారుణం

- నూతన మద్యం విధానం సవరించాలని డిమాండ్
- 15లోగా స్పందించకుంటే... ఆందోళన తప్పదని హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ: మద్య పానాన్ని నిషేధించక పోగా మరింత ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా మద్యం దుకాణాలు పెంచుతారా? రూ.99లకే క్వార్టర్ మద్యం అందిస్తూ... మద్య పానాన్ని మరింతగా ప్రోత్సహిస్తారా? అంటూ మహిళా సంఘాలు ధ్వజమెత్తాయి. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన విధానంలో సవరణలు చేయాలని డిమాండ్ చేశాయి. ఈ విషయమై మహిళా సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతి పురస్కరించుకుని బుధవారం స్థానిక లెనిన్ సెంటర్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), మహిళా కాంగ్రెస్, ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) నేతలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. రైతు నాయకుడు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్ని మద్యం మత్తులో ఉంచే దిశగా మద్యం పాలసీని గాంధీ జయంతి రోజు నుండే అమలు చేయడం సిగ్గుచేటన్నారు. దీనిపై మహిళా లోకానికి ఏ సమాధానం చెబుతారని ప్రభుత్వాన్ని

- మిగతా 2 లో

నాలుగు నెలల్లోనే తీవ్ర వ్యతిరేకత

- వైసీపీ అనుబంధ సంఘాల సమావేశంలో జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంపై నాలుగు నెలల్లోనే ప్రజా వ్యతిరేకత ఏర్పడిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలతో ప్రజల్లో ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పరిపాలనను పక్కనపెట్టి... దేవుడికే ఆగ్రహం తెప్పిస్తున్నారని అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర

- మిగతా 2 లో

దసరా సెలవులపై గందరగోళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుతామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఆదిలోనే ఆడ్డంకులు ఎదురవుతున్నాయి. దసరా సెలవుల విషయంలో అధికారుల వింతపోకడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇంటర్మీడియట్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఈనెల 3వ తేదీ నుంచి 13 వరకు దసరా సెలవులను అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీజేసింది. దీన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వర్తింపజేసింది. దీంతో తల్లిదండ్రులు

- మిగతా 2 లో

కరుగుతున్న నల్లరాయి

- మైనింగ్ మాఫియా ఇష్టారాజ్యం
- అల్లూరి జిల్లాలో యదేచ్ఛగా తవ్వకాలు

2లో

ఇదీ లోకం!

చెత్త పన్ను ఇక రద్దు

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తాం. మత్స్యకారులకు ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేస్తాం. బందరు లడ్డు, రోల్డ్ గోల్డ్ నగల తయారీ పరిశ్రమను అభివృద్ధి చేస్తాం. ఈ రెండింటి కోసం ఎమ్ఎస్ఎమ్ఈ క్లస్టర్ ఏర్పాటు చేస్తాం. కళంకారీ వస్త్ర పరిశ్రమకు న్యాయం చేస్తాం. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, పి.నారాయణ, కొలుసు పార్థసారథి, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన హామీల అమలుపై చర్చించే అవకాశముంది. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపైనా కేబినెట్‌లో చర్చించనున్నారు. దీంతోపాటు ఉచితంగా మూడు సిలెండర్ల పథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటారని సమాచారం. చెత్తపై విధించిన పన్ను రద్దును కేబినెట్‌లో ఆమోదించనున్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటుపైనా చర్చిస్తారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపైన కీలక నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. ఇప్పటికే ఏపీ టెట్ పరీక్షలు ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షలు అయిన వెంటనే డిసెంబరులో డీఎస్సీ ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. వాటితోపాటు జిల్లాల వారీగా అభివృద్ధి అంశాలు, కొత్తగా చేపట్టబోయే కార్యక్రమాలపైనా ఆమోదం రానుంది. వలంటీర్ల వ్యవస్థ కొనసాగించాలా?, లేక ఉంచాలా? అనే దానిపైనా మంత్రివర్గ సమావేశంలో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

ఇజ్రాయిల్ నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

గుటెరస్‌ను తమ దేశంలోకి ప్రవేశించకుండా నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. తమపై ఇరాన్ చేసిన దాడిని ఆంటోనియో గుటెరస్ ఖండించలేదని ఇజ్రాయిల్ విదేశాంగశాఖ మంత్రి కాట్జ్ పేర్కొన్నారు. ఉగ్రవాదులు, రేపిస్టులు, హంతకులకు అండగా నిలుస్తున్నారని, ఐరాస చరిత్రపై ఆయన ఓ మాయని మచ్చ అంటూ తీవ్ర విమర్శలు చేశారు. గుటెరస్ ఉన్నా... లేకపోయినా ఇజ్రాయిల్ తన పౌరులను రక్షించుకుంటుందని, దేశ గౌరవాన్ని నిలబెట్టుకుంటుందని వ్యాఖ్యానించారు. గుటెరస్‌ను 'పర్సనా నాన్ గ్రాటా'గా ప్రకటించామని పేర్కొంటూ... ఇజ్రాయిల్‌లోకి ప్రవేశించకుండా నిషేధిస్తున్నట్లు వెల్లడించారు.

రూ.2 వేల కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

వెనుక అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ సిండికేట్ హస్తం ఉందని అనుమానిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలోని తిలక్ నగర్ ప్రాంతంలో 400 గ్రాముల హెరాయిన్, 160 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరు ఆఫ్ఘన్ పౌరులను అరెస్టు చేసిన తర్వాత ఈ భారీ మాదకద్రవ్యాల రాకెట్‌ను ఛేదించడం గమనార్హం.

కరుగుతున్న నల్లరాయి

విశాలాంధ్ర- పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరుకి అతి సమీపంలో అక్రమంగా నల్లరాయి క్వారీ నిర్వహిస్తున్నారు. స్థానికుల భద్రతకు తీవ్ర ముప్పుగా తయారైన ఈ క్వారీ వ్యవహారంపై ప్రజా సంఘాలు ఈ విషయంపై ఆందోళనలు చేసినప్పటికీ... మైనింగ్ మాఫియాను అడ్డుకునే నాథుడే లేడు. యథేచ్ఛగా నల్లరాయి బ్లాస్టింగ్ జరుగుతున్నప్పటికీ జిల్లా ఉన్నత అధికారులు కిమ్మనడం లేదు. సంబంధిత మైనింగ్ శాఖలో బదిలీల నేపథ్యంలో కొత్త అధికారులు జిల్లాలో ఇంకా చార్జి తీసుకోకపోవడంతో ఇదు అదునుగా మైనింగ్ మాఫియా భారీ బ్లాస్టింగ్‌లతో నల్లరాయిని కొల్లగొడుతోంది. వారికి కేటాయించిన మైనింగ్ఏరియాతో పాటు పరిధి దాటి... అనువుగా ఉన్న చుట్టుపక్కల ప్రదేశాల్లో కూడా భారీ బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తూ దగ్గర్లోని గ్రామాలకు అతి సమీపంలో పెద్దఎత్తున బ్లాస్టింగ్లు నిర్వహిస్తూ...పకృతి సంపదను దోచుకుంటున్నారు. గిరిజనులకు మాయ మాటలు చెప్పి వారి ఆరోగ్యానికి, పంట భూములకు హాని చేసే విధంగా గిరిజన ప్రాంతంలో అనుమతి లేనటువంటి పేలుడు పదార్థాలు(జిలిటెన్ స్టిక్స్) ఉపయోగించి నివాస ప్రాంతాల దగ్గర్లో భారీ పేలుళ్లను జరిపి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పాడేరు మండలం గబ్బంగి పంచాయతీ దేవరపల్లి గ్రామానికి అతి సమీపంలో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీ కి 2 హెక్టార్ల స్థలం మైనింగ లీజు ఇచ్చినప్పటికీ దానికి మించి తవ్వకాలు జరుపుతున్నారు. చుట్టుపక్కల గ్రామాలైన కొత్తబు, కురేడేమెట్ట, దేవరపల్లి ప్రజలకు మైనింగ్ పై అవగాహన లేదని తెలిసి... మైనింగ్ అధికారులతో కుమ్మక్కై పరిమితికి మించి ఊరికి అతి సమీపంలో పెద్దఎత్తున బ్లాస్టింగ్ లు జరుపుతున్నారు. దీనిపై స్థానిక విద్యావంతులు ప్రశ్నించినప్పుడు రాయి తవ్వుకోవడానికి తమకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని మభ్యపెట్టి వారిని బెదిరిస్తున్నారు. పత్రాలు చూపించమని అడిగితే... సంబంధిత శాఖకు మాత్రమే చూపిస్తాం మీకు చూపించవలసిన అవసరం లేదని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పోనీ సంబంధిత జిల్లా అధికారుల దగ్గరికి వెళ్దాం అన్నా కూడా జిల్లా అధికారులు ఎవరు అందుబాటులో లేని పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు వాపోయారు. ఈ విషయమై మైనింగ్ శాఖ ఉద్యోగులను వివరణ కోరగా... కొత్త అధికారులు ఎవరు ఇంకా చార్జి తీసుకోలేదని చెబుతున్నారు. దీంతో ఆ చుట్టుపక్క ల ప్రాంతాల ప్రజలు ఎవరికి ఈ గోడు చెప్పుకోవాలో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో మైనింగ్ మాఫియా ఏం చేస్తుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తమ గ్రామాలను సందర్శించాలని... తగిన రీతిలో విచారణ జరిపించి మైనింగ్ మాఫియా ఆగడాలను అరికట్టాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇజ్రాయిల్‌కు అమెరికా అండ

ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడంలో సాయం

వాషింగ్టన్: పశ్చిమాసియాను మళ్లీ యుద్ధ మేఘాలు కమ్మేశాయి. హిజ్బుల్లా, హమాస్ అగ్రనేతలను అంతమొందించిన ఇజ్రాయిల్‌పై ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగింది. ఒక్క రాత్రిలో దాదాపు రెండు వందల బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. వీటిలో చాలా వాటిని అమెరికా సాయంతో ఇజ్రాయిల్ అడ్డుకుంది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించిన నాటి నుంచి పశ్చిమాసియాలోని పరిస్థితులపై అమెరికా ప్రత్యేక దృష్టి పెట్టింది. నిత్యం అక్కడ ఏం జరుగుతుందనేది అధ్యక్షుడు జో బైడెన్ గమనిస్తూనే ఉన్నారు. ఇజ్రాయిల్‌పై దాడికి యత్నిస్తే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అగ్రరాజ్యం హెచ్చరించింది. అయినప్పటికీ ఇరాన్ వెనక్కి తగ్గలేదు. అదే సమయంలో సిచ్యువేషన్ గదిలో కూర్చున్న జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ పశ్చిమాసియాలోని పరిస్థితులను ప్రతి క్షణం పర్యవేక్షించారు. ఇజ్రాయిల్‌కు సాయం చేయమని ఆయన అమెరికా మిలటరీకి ఆదేశాలు జారీ చేసినట్లు వైట్‌హౌస్ స్థానిక మీడియాకు వెల్లడించింది. ఇరాన్ దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు నిఘా వర్గాల ద్వారా అమెరికాకు సమాచారం అందింది. ఈ ఏడాది ప్రారంభంలో టెహ్రాన్ చేసిన దాడి కంటే ఇప్పుడు జరగబోయేది పెద్దదంటూ ఇజ్రాయిల్‌ను హెచ్చరించింది. రాబోయే 12 గంటల్లో దాడి జరగొచ్చని అప్రమత్తం చేసింది. దాడికి ముందు తూర్పు మధ్యధరా ప్రాంతంలో యూఎస్ఎస్ కోల్, బుల్కెలీ అనే రెండు అర్లీ బర్క్- క్లాస్ డెస్ట్రాయర్లు అమెరికా మోహరించి ఉంది. ఇరాన్ దాడులను తిప్పికొట్టేందుకు ఇజ్రాయిల్- అమెరికా దళాలు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకున్నాయి. ఈ క్రమంలోనే ఇజ్రాయిల్‌పైకి ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను అడ్డుకునేందుకు అమెరికా డజన్ల కొద్దీ ఇంటర్‌సెప్టర్స్‌ను పంపించిందని పెంటగాన్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. అమెరికా అడ్డుకోవడంతో ఇజ్రాయిల్ భూతలంలో తక్కువ నష్టం జరిగినట్లు తెలిపారు. ముఖ్యంగా ఐడీఎఫ్‌తో టచ్‌లో ఉంటూ ఇరాన్ కుట్రను ఎప్పటికప్పుడు గమనిస్తూ దాడులను తిప్పికొట్టినట్లు వివరించారు.

ఇజ్రాయిల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం...

ఇజ్రాయిల్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ మంగళవారం రాత్రి వందలకొద్దీ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వీటిలో ఒకటి ఇజ్రాయిల్ రాజధాని టెల్‌అవీవ్‌లోని మొస్సాద్ ప్రధాన కార్యాలయం సమీపంలో పడింది. దీంతో ఆ ప్రాంతంలో భారీ గుంత ఏర్పడింది. క్షిపణి పడిన సమయంలో పెద్దఎత్తున దుమ్ము రేగడంతో అంతకుముందు అక్కడ పార్క్ చేసిన వాహనాలన్నీ మట్టిలో కూరుకుపోయినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ గుంతకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. హిజ్బుల్లాలోని కీలక ప్రాంతాల్లో ఐడీఎఫ్ దళాలు భీకర దాడులు చేసిన తర్వాత.. ఆ దేశంపై ఇరాన్ ప్రత్యక్ష దాడికి దిగింది. ఇరాన్ దాడితో అప్రమత్తమైన అయిన ఇజ్రాయిల్.. దేశ ప్రజలను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా సైరన్ల మోత మోగింది. ఇజ్రాయిల్‌పై క్షిపణుల ప్రయోగం అనంతరం ఇరాన్ స్పందించింది. అక్కడి పౌరులనుద్దేశించి ఈ దాడులు చేయలేదని... చనిపోయిన హమాస్ అధినేత ఇస్మాయెల్ హనీయా, హిజ్బుల్లా చీఫ్ సయ్యద్ హసన్ నస్రల్లా, నిల్ఫోరూషన్ మరణానికి ప్రతీకారంగా ఈ దాడులు చేపట్టినట్లు అధికారికంగా ప్రకటించింది.

ఇరాన్‌కు నెతన్యాహు హెచ్చరిక

ఇరాన్ దాడుల తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు తీవ్రంగా స్పందించారు. ఈ దాడికి టెహ్రాన్ కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మద్యం దుకాణాల పెంపు దారుణం

(మొదటిపేజీ తరువాయి)

నిలదీశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం పెడ మార్గంలో వెళుతోందన్నారు. ఒక వైపు విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం కాకుండా ప్రజలు పోరాటం చేస్తుంటే దాన్ని పక్కదారి పట్టిస్తూ సనాతన ధర్మం పేరుతో భావోద్వేగాలను రెచ్చగొడుతూ లడ్డూ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర నాయకులు యు.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మద్యం నియంత్రిస్తామని మరింతగా అమ్మకాలు పెంచటం దుర్మార్గం అన్నారు. యువతను మద్యం మత్తులో ఉంచి తమ పబ్బం గడుపుకుందామనే ఆలోచనలో పాలకులు ఉన్నారని విమర్శించారు. దీనిపై మహిళాలోకం ఐక్యంగా పోరాటాలు సాగించాలన్నారు. ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ, ఐద్వా ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకర పద్మశ్రీ, పీఓడబ్ల్యూ కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ రాష్ట్రంలో 2,600 మద్యం షాపులు పెంచడం, ప్రైవేటు వ్యక్తులకు లైసెన్సులు ఇవ్వడం... లైసెన్సు ఫీజులు ద్వారా ప్రభుత్వానికి రెండు వేల కోట్ల ఆదాయం రావడం వంటివి చూస్తూ ఉంటే ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూస్తూ పేద ప్రజల జీవితాలను మరింత చీకటి మయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మద్యానికి బానిసై తప్పుడు మార్గంలో వెళ్లడం, రాష్ట్రంలో అనేక నేరాలకు కారణం మద్యం అని తెలిసి కూడా మద్యాన్ని నియంత్రించకుండా... మరింతగా అమ్మకాలు పెంచడం, పైగా నాణ్యమైన మద్యాన్ని క్వార్టర్ 99 రూపాయలకే అంటూ ప్రకటన చేయడం సరైంది కాదన్నారు. నాణ్యమైన మద్యం ప్రజల ప్రాణాలు తీయదా? మహిళపై హింసకు కారణం కాదా ?అని ప్రశ్నించారు. మద్యం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్గించే ప్రచారం చేపట్టి అంచెలంచెలుగా మద్యాపాన నియంత్రణ, నిషేధం చేయాలని సూచించారు. మద్యం నూతన విధానంపై మహిళా సంఘాలతో, అన్ని వర్గాలతో చర్చించి తుది నిర్ణయం చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రిని, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రిని కలవడానికి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ నెల 15 లోపు ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోతే 16వ తేదీ నుండి ప్రత్యక్ష ఆందోళనలు సాగిస్తామని హెచ్చరించారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయం నుండే మద్యానికి బానిసలై మరణించిన వారి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, గతంలో మాదిరిగా డ్రై డే పెట్టాలని , తాగుబోతులను గుర్తించి డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. మద్యం అమ్మకాలను ప్రభుత్వ నియంత్రణలో ఉంచుతూ సమయాన్ని కూడా గతంలో ఉన్నట్టుగా ఉదయం 11 నుండి రాత్రి 8 వరకు మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో ప్రభుత్వ నియంత్రణలో ఉండే మద్యం, నేడు ప్రైవేట్ వ్యక్తులు చేతుల్లో సిండికేట్ల చేతుల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, ఆర్ రవీంద్రనాథ్ (ఏఐటీయూసీ), పి.జమలయ్య (కౌలు రైతు సంఘం), డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సుబ్బరావమ్మ (శ్రామిక మహిళా సంఘం) వై.కేశవరావు (రైతుసంఘం) మోతుకూరి అరుణకుమార్ (అరసం), మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బంకా ఝాన్సీ, మాజీ కార్పొరేటర్లు కే శ్రీదేవి, ఆదిలక్ష్మి, సరోజ, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, మహిళా సమాఖ్య విజయవాడ నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి, యువజన సమాఖ్య నాయకులు గోవింద రాజులు, భార్గవ్, లంకె సాయి పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి చంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, కోశాధికారి ఆర్ పిచ్చయ్య, రాష్ట్ర నాయకులు ఎస్కే. నజీర్‌లు, మద్య నియంత్రణ కోరుతూ అభ్యుదయ గేయాలు ఆలపించారు. తొలుత గాంధీజీ చిత్ర పటానికి పూల దండలు వేసి నివాళులు అర్పించారు. నూతన మద్యం విధానం పై సవరణలు చేయాలని, ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు డి.సీతారావమ్మ, చింతాడ పార్వతి, మూలి ఇందిర, డి.రమణమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

'వస్తున్నా మీకోసం' చేపట్టి 12 ఏళ్లు

టీడీపీ కేంద్ర కార్యాలయంలో వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 63 ఏళ్ల వయస్సులో 'వస్తున్నా... మీకోసం' పాదయాత్ర చేపట్టి 12 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలు వేడుక నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు అధ్వర్యంలో 12 కేజీల కేకును పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ఎమ్మెల్సీ అశోక్ బాబు కట్ చేశారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ అరాచక పాలనతో ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు బాసటగా నిలిచేందుకు 63 ఏళ్ల వయస్సులో చంద్రబాబు 2012 అక్టోబరు 2న అనంతపురం జిల్లా, హిందూపురం నుంచి వస్తున్నా మీ కోసం పాదయాత్ర ప్రారంభించారన్నారు. కుప్పకూలిన ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేందుకు, రాష్ట్ర ప్రజలను ఆదుకునేందుకు, ప్రజాపాలనను స్థాపించాలనే దృఢ సంకల్పంతో చంద్రబాబు సుదీర్ఘమైన 2,817 కిలో మీటర్ల పాదయాత్రను 208 రోజులు నిర్వహించారన్నారు. వస్తున్నా మీకోసం పాదయాత్రతో రాష్ట్ర ప్రజలను చైతన్యవంతం చేసి, దుర్మార్గపు పాలనకు స్వస్తి చెప్పారన్నారు. చంద్రబాబు కష్టానికి ఫలితంగా 2014లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి వర్ధిల్లిందని, మరోసారి 2024 ఎన్నికల ముందు ఉన్న రాక్షస పాలనను సైతం చంద్రబాబు నిరంతర కృషి వల్ల ప్రజాపాలనను నేడు స్థాపించగలిగామన్నారు.

ఎమ్మెల్సీ అశోక్ బాబు మాట్లాడుతూ 208 రోజులు పాటు చంద్రబాబు అలుపెరుగని యోధుడిలా మీకోసం పాదయాత్ర నిర్వహించడం ఓ చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, పార్టీ నాయకులు రెడ్డివారి గురువారెడ్డి, పరుచూరి కృష్ణ, చెన్నుపాటి గాంధీ, హసన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' కార్మికుల ఆందోళన ఉధృతం



విశాలాంధ్ర- గాజువాక: విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. 4290 మంది ఒప్పందకార్మికుల తొలగింపు చర్యలకు యాజమాన్యం పాల్పడిన క్రమంలో కార్మికులు ఆందోళన కొనసాగిస్తున్నారు. బుధవారం కూడా కాంట్రాక్టు కార్మికుల ఆందోళనలు ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. కూర్మన్నపాలెం జాతీయ రహదారిపై కార్మికుల నిరసనను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఒక దశలో పోలీసులు, కార్మికులకు మధ్య తోపులాటలు కూడా చోటుచేసుకున్నాయి. దీంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కాగా 4290 మంది కార్మికులకు యాజమాన్యం గేట్ పాస్‌లు మంజూరు చేసింది. తాత్కాలిక ప్రాతిపదికపై ఇచ్చిన వీటిపై అధికారిక సంతకాలు లేకపోవడం మరో వివాదానికి తెరలేపింది. ఉక్కు యాజమాన్య అసంబద్ధ పోకడలను కార్మికులు నిరసిస్తూ రోడ్డుపైనే బైఠాయించారు. పోలీసులు, కార్మిక సంఘాల నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. కాగా విశాఖ ఉక్కు కర్మగారాన్ని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కార్మికులకు భరోసా వచనాలు పలుకుతున్నప్పటికీ పరిస్థితుల్లో ఎటువంటి మార్పులేకపోవడంతో కార్మికుల ఆందోళనలు యథాతథంగా కొనసాగుతూ వస్తున్నాయి. ఇటు ఉక్కు యాజమాన్యం సన్నాయి నొక్కులు నొక్కుతోంది తప్ప, సమగ్ర కార్యాచరణ ప్రకటించకపోవడంపై సర్వత్రా అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ విషయంలో నియంతృత్వంగా వ్యవహరిస్తోందని కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

స్మార్ట్ మీటర్లు తొలగించాలి: శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లను తొలగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు బుధవారం ఆయన ఒక లేఖ రాశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో వివిధ రూపాలలో మోపిన విద్యుత్తు, ఇతర భారాలను తగ్గిస్తామని, చార్జీలు పెంచబోమని 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. ఆ హామీకి భిన్నంగా విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు (ఎఫ్‌పిపిసిఎ) 2022- 23 సంవత్సరానికి సుమారు 8114 కోట్ల రూపాయల భారం వేస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. 2023 -24 సంవత్సరానికి సంబంధించి మరో రూ.11 వేల కోట్ల రూపాయలకు పైగా సర్దుబాటు చార్జీల భారం మోపబోతున్నారని వార్తలు వస్తున్నాయని తెలిపారు. మొత్తం దాదాపు 20 వేల కోట్ల రూపాయల భారం విద్యుత్ వినియోగదారులు, రాష్ట్ర ప్రజలపై భారం పడబోతోందన్నారు.

మహాత్ముడి బోధనలు అనుసరణీయం: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అహింసా మార్గంలో ఉద్యమించి... బానిస సంకెళ్లు తెంచి బ్రిటీష్ పాలకుల నుంచి దేశానికి విముక్తి కలిగించిన మహాత్ముడి బోధనలు నేటికీ అనుసరణీయమని సీఎం చంద్రబాబు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం వేరెవరో పరిరక్షించరని, మనకు మనమే వాటిని కాపాడుకోవాలని గాంధీ చెప్పిన మాటలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జాతిపిత చూపిన బాటను అనుసరిస్తూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లడమే మన ముందున్న కర్తవ్యమన్నారు. జై జవాన్ జై కిసాన్ పిలుపునిచ్చి దేశాన్ని ముందుకు నడిపించిన నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి అని సీఎం చంద్రబాబు అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా దేశం గర్వించదగ్గ ఆ మహనీయుని స్మృతికి నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. ఆయన నిజాయితీ, నిరాడంబరత, వ్యక్తిత్వం, త్యాగశీలత అందరికీ స్ఫూర్తిదాయకం కావాలని పేర్కొన్నారు.

మరో వివాదంలో సీఎం సిద్ధరామయ్య

చేతిలో జాతీయ జెండాతో ఆయన బూట్లు విప్పిన కార్యకర్త

బెంగళూరు : మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కుంభకోణం ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్నాటక సీఎం సిద్ధరామయ్యను మరో వివాదం చుట్టుముట్టింది. చేతిలో జాతీయ జెండా పట్టుకున్న కాంగ్రెస్ కార్యకర్త ఒకరు సిద్ధరామయ్య బూట్లు విప్పాడు. ఈ వీడియో దృశ్యం సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యింది. దీంతో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు వెల్లువెత్తాయి. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి నివాళి అర్పించే ముందు కాళ్లకు ఉన్న బూట్లు విప్పేందుకు ప్రయత్నించారు. ఆయన ఒంగలేకపోవడంతో చేతిలో చిన్న త్రివర్ణ పతాకం పట్టుకున్న కాంగ్రెస్ కార్యకర్త ఒకరు సిద్ధరామయ్య బూట్లు విప్పాడు. ఇది గమనించిన భద్రతా సిబ్బంది ఆ వ్యక్తి చేతి నుంచి ఆ జెండా తీసుకున్నాడు. దీనిపై బీజేపీ కూడా మండిపడింది. బీజేపీ సీనియర్ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి ఈ సంఘటనపై స్పందించారు. 'ఇది జాతి గౌరవానికి అవమానం. ఇదీ కాంగ్రెస్ పార్టీ నాయకుల సంస్కృతి. వారు క్షమాపణ చెప్పాలి' అని 'ఎక్స్' పోస్ట్‌లో విమర్శించారు.

నాలుగు నెలల్లోనే తీవ్ర వ్యతిరేకత

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో బుధవారం పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో జగన్ కీలక సమావేశం నిర్వహించారు. జగన్ మాట్లాడుతూ పార్టీలో అనుబంధ విభాగాలు చాలా కీలకమని, పార్టీని గ్రామస్థాయి వరకు విస్తరించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం తిరోగమనంలో ఉందని, ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలైనా... ఇంతవరకూ సూపర్ సిక్స్ గానీ, సూపర్ సెవన్‌గానీ లేదని ఎద్దేవా చేశారు. అబద్ధాలు మోసం కింద మారి... అవి ప్రజల కోపంగా మారుతున్నాయని, అందుకే ఈ ప్రభుత్వంపై వ్యతిరేకత చూస్తున్నామన్నారు. అన్ని విషయాల్లోనూ ఈ ప్రభుత్వం విఫలమైందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆస్పత్రులు, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా వంటి ప్రజోపయోగ కార్యక్రమాలన్నీ నిలిచిపోయాయని తెలిపారు. మూడు నెలల్లో లక్షన్నర ఫించన్లు తగ్గించారని, జన్మభూమి కమిటీలు వచ్చాయన్నారు. చదువులు లేవు... వ్యవసాయానికి పెట్టుబడి సాయం, ఆర్బీకేలు, ఉచిత పంటల బీమా అటకెక్కాయన్నారు. వ్యవసాయం, చదువులు, వైద్యం.. ఈ మూడు రంగాల్లో ప్రభుత్వం పూర్తిగా తిరోగమన దిశలో పయనిస్తోందని విమర్శించారు. ఇష్టం వచ్చినట్లు దొంగ కేసులు పెట్టి రెడ్‌బుక్ పరిపాలన చేస్తున్నారని, శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. విజయవాడలో వరద నష్టాన్ని అంచనా వేయలేని దుస్థితిలో ఉన్నారని, బాధితులు కలెక్టర్ కార్యాలయాన్ని చుట్టుముడుతున్నారని వివరించారు. నాలుగు నెలలకే ప్రభుత్వంపై వ్యతిరేకత తారస్థాయికి వెళ్లడంతో ఎప్పటికప్పుడు ప్రజల దృష్టి మళ్లించే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తిరుపతి లడ్డూ అని ఒకసారి, డిక్లరేషన్ అని మరోసారి తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు ధ్వజమెత్తారు. వైసీపీకి సంబంధించిన దాదాపు 24 అనుబంధ విభాగాలను క్రియాశీలం చేస్తున్నామని, పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుబంధ సంఘాలు పోషించే పాత్ర చాలా కీలకమైనదని తెలిపారు. పార్టీకి కాళ్లు చేతులు అనుబంధ సంఘాలేనని, ఇవి ఎంత బలంగా ఉంటే పార్టీ అంత బలంగా పోరాడగలదన్నారు.

అనుబంధ విభాగాలకు సంబంధించి జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి వరకు నియామకాలు చేపట్టాలని, ముందుగా బలమైన జిల్లా అధ్యక్షుల నియామకం జరగాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి, ఆ ప్రక్రియలో నష్టపోయిన వారికి పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని, వారికే ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టంచేశారు. అనుబంధ విభాగాల అధ్యక్షులు ఎలా పని చేయాలనే దానిపై త్వరలో వర్క్‌షాపు నిర్వహిస్తామని జగన్ చెప్పారు.

దసరా సెలవులపై గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

తమ పర్యటనలకు షెడ్యూలు ఖరారు చేసుకున్నారు. ముందస్తు రిజర్వేషన్లు అయ్యాయి. ఇదే సమయంలో ప్రైవేట్ విద్యాసంస్థలకు 3 నుంచి సెలవులు ఇవ్వడం లేదని ప్రకటించారు. 3 నుంచి 5వ తేదీ వరకు తరగతులు యథాతథంగా పనిచేస్తాయని వెల్లడించారు. విద్యార్థులకు దసరా సెలవులకు సంబంధించి ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు మాత్రం ఇంకా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఈ నెల 3 నుంచి 13 వరకు దసరా సెలవులను రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఆయా జిల్లాల్లో ప్రభుత్వ రంగ జూనియర్ కళాశాలలు, ప్రైవేట్/కార్పొరేట్ జూనియర్ కళాశాలలకు వేర్వేరుగా సెలవులు ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. ఇంటర్మీడియట్ బోర్డు జారీజేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా... 3, 4, 5 తేదీల్లో తరగతులు నిర్వహించుకోవడానికి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు అభ్యర్థించినట్లు తెలిసింది. దీనిపై ఇంటర్ విద్యార్థులు, తల్లిదండ్రులు, జూనియర్ లెక్చరర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వపరంగా దసరా సెలవులు 10 రోజులు ప్రకటించగా, ఇందులో మూడు రోజులు తొలగిస్తే... కేవలం ఏడు రోజులే ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు సెలవులు ఇచ్చినట్లయింది. ప్రభుత్వం నడుపుతున్న సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, కేజీబీవీ, హైస్కూల్ ప్లస్, ఎయిడెడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు 3 నుంచి 13 వరకు సెలవులు ప్రకటించారు. అదే ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఈ సెలవులు పాటించడం లేదు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో సిలబస్ ముందుగా పూర్తయ్యే పరిస్థితి ఉండగా... ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు వెనుకబాటుకు గురవుతారు. దీనిపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు అనేక పొంతనలేని సాకులు చెబుతున్నారు. ఇటీవల భారీవర్షాలు, వరదల వల్ల చాలా జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు కాంపన్సేటరీ సెలవులు ప్రకటించారని, ఆ సెలవులు ఆరు వరకూ ఉన్నాయని తెలుపుతున్నారు. వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వ సెలవు దినాల్లో పరిహారంగా విద్యాసంస్థలు పనిచేయాల్సి ఉంటుందని, దానికి అనుగుణంగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులను అభ్యర్థించినట్లు చెబుతున్నారు. ఒకటి, రెండు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యం ఒత్తిళ్లతోనే బోర్డు అధికారులు తలొగ్గి... దసరా సెలవులు కుదించడం, సెలవుల్లో పాఠాలు చెప్పేందుకు అనుమతులిచ్చినట్లు తెలుస్తోంది. ఇంటర్మీడియట్ బోర్డు తీరును విద్యార్థి సంఘాలు తప్పుపడుతున్నాయి. సెలవుల్లో విద్యార్థులకు పాఠాలు బోధించడంతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరుగుతుంది. లెక్చరర్లు ఇబ్బందులకు గురవుతారు. దసరా సెలవుల్లో ప్రైవేటు కళాశాలలు నిర్వహించుకోవడానికి ఇంటర్ బోర్డు ఇచ్చిన అనుమతులను రద్దుచేయకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని జూనియర్ కళాశాలల లెక్చరర్ల సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలల్లోను దసరా సెలవులకు కోత విధించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా టెన్త్ చదివే విద్యార్థులకు కేవలం దసరాకు ముందు, వెనుక మాత్రమే సెలవులు ఇచ్చేలా యాజమాన్యం ప్రణాళిక వేసుకున్నట్లు తెలిసింది. రాష్ట్రంలోని పేరొందిన కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు, సీబీఎస్ఈ సిలబస్‌తో నడుస్తున్న విద్యాసంస్థలు ఈ తరహాగా సెలవుల్లో తరగతుల నిర్వహణకు ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి... ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఒకే తరహా సెలవులు ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రికి జగన్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికి వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళలర్పించారు.

గాంధీజీ, శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు జగన్ పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నేత కొమ్మూరి కనకారావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా ధర్నా

విశాలాంధ్ర - చల్లపల్లి : నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో చల్లపల్లి లోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి మాట్లాడుతూ మద్యం షాపుల సంఖ్య, సమయం కుదించాలని డిమాండ్ చేసారు. మద్యపానంతో కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మద్యపానం నియంత్రించే విధం గా చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రై డే ని అమలు చేయాలన్నారు. షాపులలో, బయట అక్రమ అమ్మకాలు నిరోధించే విధంగా కఠిన చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేసారు. మద్యం మీద వచ్చే ఆదాయంలో 2 శాతం మద్యం వల్ల జరిగే నష్టల గురించి ప్రచారం చేసేందుకు వినియోగించాలన్నారు. మద్యం సేవించే వారిని గుర్తించి డి ఎడిక్షన్ కేంద్రాలద్వారా వైద్యం అందించాలన్నారు. ప్రతీ పీహెచ్సీ కేంద్రంలో డి ఎడిక్షన్ సెంటర్ ను ఏర్పాటు చేయాలనీ కోరారు. మద్యంతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలలోని మహిళలకు నష్టం పరిహారం చెల్లించాలన్నారు . మద్యం తాగి కుటుంబ సభ్యు లను వేధించే వారిపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసు కోవాలన్నారు. ప్రభుత్వం ప్రతీ సంవత్సరం మద్యంపై వచ్చే ఆదాయాన్ని తగ్గించుకునే లక్ష్యంగా ఎక్సైజ్ విధానాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం ఆధ్వర్యలోనే మద్యం షాపులను నిర్వహించాలని, ఉదయం 11 గంటలనుండి రాత్రి 8 గంటలవరకు మాత్రమే షాపులకు అనుమతి ఇవ్వాలన్నారు. మహిళలు ఎక్కువగా సంచరించే ప్రదేశాలలో అనుమతులు ఇవ్వరాదని కోరారు. ఈ కార్యక్రంలో మహిళా సమాఖ్య నాయకులు కంచర్ల ప్రభు కుమారి, వేములపల్లి నాగేంద్రమ్మ, కుర్రా అరుణ కుమారి, అట్లూరి స్వరూప, దాసి కోటేశ్వరమ్మ, సిపిఐ నాయకులు మల్లుపెద్ది బోసు, అట్లూరి వెంకటేశ్వరరావు, సిధాబత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మునికి నివాళులు

విశాలాంధ్ర-చల్లపల్లి : గాంధీ జయంతి సందర్భంగా చల్లపల్లిలోని గాంధీజీ స్మృతివనంలో మహాత్మా గాంధీ అతిపెద్ద విగ్రహానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, విజయ అకాడమీ ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, విజయా అకాడమీ ఉపాధ్యాయ బృందం, చిన్నారులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ...

జాతిపిత మహాత్మా గాంధీ 154వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో చల్లపల్లిలోని గాంధీ విగ్రహం వద్ద మహిళలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మల్లు పెద్ది రత్నకుమారి మాట్లాడుతూ ఆడది అర్ధ రాత్రి వంటరిగా తిరుగునప్పుడే నిజమైన స్వతంతరం అన్న గాంధీజి ఆశయం నేటికీ నెరవేరాలేదన్నారు. స్వతంత్రం వచ్చి 80 ఏళ్ళు కావస్తున్న నేటికీ మహిళలకు రక్షణ కరువైందన్నారు. గాంధీ కలలు కన్నా స్వరాజ్యం స్థాపన కోసం భారతదేశంలో ఉన్న ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. గాంధీ చూపిన అహింస, సత్యం మార్గాలను అనుసరించాలని సూచించారు. అదే గాంధీకి మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులుకంచర్ల ప్రభు కుమారి, వేములపల్లి నాగేంద్రమ్మ,అట్లూరి స్వరూప, కుర్రా అరుణ,సిపిఐ నాయకులు అట్లూరి వెంకటేశ్వరరావు, మల్లుపెద్ది బోసు, సిద్ధబత్తులన వాసు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ గ్రామసభలు

విశాలాంధ్ర-పెదపారుపూడి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో భాగంగా గత 15 రోజులుగా జరిగిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ సభలు గాంధీ జయంతి సందర్భంగా ముగిశాయని మండల పంచాయతీ రాజ్ విస్తరణాధికారి వంగ శ్రీనివాస్ (వంశీ) బుధవారం అన్నారు. మండలంలోని భూషణగూళ్ళ గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి షరీఫ్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు పై ఉన్నదని అన్నారు. దేశానికి స్వతంత్రత కంటే ముందు స్వచ్ఛత ఎంతో అవసరమని ఆరోజున గాంధీ వ్యాఖ్యానించారన్నారు. సత్యం అహింస స్వచ్ఛత లకు ఆయన మార్గదర్శకులని అన్నారు. అదే రోజు భారత దేశ మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని జై జవాన్, జై కిసాన్ అనే విధానంను ముందుకు తీసుకొచ్చారని అన్నారు. జై జవాన్ అనగా సరిహద్దుల్లో సైన్యం, జై కిసాన్ అనగా దేశంలో రైతులు క్షేమంగా ఉండాలని ఆనాటి ఆ ప్రధాని కోరుకున్నారని ఆయన లాల్ బహదూర్ శాస్త్రి ని స్మరించుకున్నారు. అనంతరం రామాలయ సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహానికి సీనియర్ రాజకీయ నాయకులు గోగం రామారావు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ టిఏ కోట బ్యూలా రాణి, రాజారావు, నాగరాజు, రాంబాబు, స్పందన, రాయపల్లి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర-ఘంటసాల : భారీ వర్షాలకు చేనేత మగ్గాల్లోకి నీరు చేరి ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న చేనేత కార్మికుల కుటుంబాలకు ఉత్తర అమెరికా పద్మశాలీ అసోసియేషన్, అఖిల భారత పద్మశాలీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 200 చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల విలువైన నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఘంటసాలలోని ఏపీ పద్మశాలీ సంఘం జనరల్ సెక్రటరీ అందె జగదీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందిగట్ల స్వామి మాట్లాడుతూ నాపా సేవలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో మన సంఘీయుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం కన్వీనర్ జీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత సంఘాల బలోపేతంగా ఉండటం వల్ల మనకు విపత్తులు వచ్చినప్పుడు మనలను ఆదరించడానికి పూర్తిగా సహకరిస్తారన్నారు. సంఘం జనరల్ సెక్రటరీ జగదీష్ మాట్లాడుతూ ఆగస్టు 30న, సెప్టెంబర్ 10 వరకు కురిసిన భారీ వర్షాలకు ఘంటసాల, యార్లగడ్డ, పురిటిగడ్డ, కాజ గ్రామాలకు చెందిన సుమారు 200 మంది చేనేత కార్మికుల మగ్గాల గుంతల్లోకి నీరు చేరి ఉపాధి కోల్పోవడంతో జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్మికుల ఆకలి కేకలను గుర్తించి నాపా, పద్మశాలి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో ఒక్కో కుటుంబానికి రూ.2,200 విలువైన బియ్యం, కంది పప్పు, నూనె, గోదుమ పిండి, ఇతర నిత్యావసరాలతో కూడిన కిట్లను 200 మంది కార్మికులకు అందించినట్లు చెప్పారు. కష్టకాలంలో ఆదుకున్ను తమను ఆదుకున్న ఉత్తర అమెరికా పద్మశాలీ సంఘం అసోసియేషను, సంఘం అధ్యక్షులు సాయిని శ్రీనివాస్ కి, సంఘం నాయకులకు ఆయా గ్రామాల చేనేత కార్మికులు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం ఇంజినీరింగ్ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా వేణుమాధవ్, ఉడతా చిత్తరంజన్ సాయి, గుత్తికొండ సత్యనారాయణ, కొడాలి శ్రీకాంత్, అక్కుల లీలా ప్రసాద్, గోలి వెంకటేశ్వర్లు, నాగమల్లేశ్వరరావు, జంజనం రామ్మోహనరావు, విట్టంశెట్టి దుర్గారావు, కోదాటి కృష్ణ మోహన్, తిరువీధుల వెంకటేశ్వరావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులోని లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో బుధవారం వివిధ కార్యక్రమాలను నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. మొదటిగా గాంధీ జయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ సభ్యులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగ శిక్షణా తరగతులను లయన్ గద్దె శేషగిరితో ప్రారంభించారు. ఈ యోగ శిక్షణా తరగతులో ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శశికళ కోరారు. మధ్యాహ్నం వంద రోజుల ప్రణాళికలో భాగంగా వల్లభనేని సుబ్బారావు, జానకమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్ సేవ భవనంలో నిర్వహించి 100 పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ కు రీజినల్ ఛైర్పర్సన్ ఉపద్రష్ట రాంబాబు 50 మొక్కలను అందించగా వారికి కృతజ్ఞతలు తెలిపి నేడు మధ్యాహ్నం 3 గంటలకు వాకర్స్ ట్రాక్ వద్ద వాటిని నాటుతామని అధ్యక్షురాలు శశికళ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో లయన్ పెరుమాళ్ళు, లయన్ నవాబు, లయన్ మోహనరావు, లయన్ పరంధామయ్య, లయన్ వైపిసి ప్రసాద్, లయన్ వి. సుబ్బారావు, లయన్ రవీంద్ర, లయన్ సత్తిరాజు, లయన్ నాగేశ్వరరావు, యోగా గురువులు లయన్ అంకాల సత్యనారాయణ , కెడివిఎన్ శ్రీనివాస్, గురువెల్లి కృష్ణ, లయన్ కాట్రగడ్డ రజని, లయన్ ఎన్.వి.వి. ప్రసాద్, లయన్ శ్రీనివాసరెడ్డి తదితర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయాల పవిత్రతను కాపాడుతాం : మండలి

విశాలాంధ్ర-చల్లపల్లి : దేవాలయాల పవిత్రత కాపాడేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం జనసేన పార్టీ పిలుపు మేరకు నగర సంకీర్తన పురస్కరించుకొని చల్లపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వరకూ కూటమి నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చల్లపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో దేవాలయాల ప్రాభవం తగ్గిందన్నారు. తిరుమలలో లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగం మాత్రమే కాకుండా వైసీపీ ప్రభుత్వంలో తిరుమల ప్రతిష్ట తగ్గేలా అవినీతి జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఐదేళ్లు తిరుమల తిరుపతిలో ఆధ్యాత్మిక సౌరభాలు కానరాలేదన్నారు. భక్తులు పవిత్రంగా స్వీకరించే లడ్డూ ప్రసాదం నిల్వ సామర్థ్యం కూడా తగ్గిపోయి భక్తులు తీవ్ర మనోవేదనకు గురయ్యే వారన్నారు. దేవాలయాలను సంరక్షించటం ప్రభుత్వ బాధ్యత అని, వైసీపీ పాలనలో దేవాలయాల అధికారులు భక్తుల మనోభావాలను గమనించలేదన్నారు. తమ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని దేవాలయాల పరిరక్షణ బాధ్యత చేపట్టినట్లు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు అడపా రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టీడీపీ సీనియర్ నాయకులు సజ్జా చలపతిరావు, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీలు మాలెంపాటి శ్రీనివాసరావు, పైడిపాముల స్వప్న, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నబీఘోరీ, టీడీపీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, నిడమానూరు దిలీప్ కుమార్, గొరిపర్తి సుబ్బారావు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు బొందలపాటి వీరబాబు, ఉరిమి మణికాంత్, నియోజకవర్గ ఐటీ కో-ఆర్డినేటర్ సూదాని నందగోపాల్, అడపా రవి, గోళ్ళ ప్రసాద్, గంగిశెట్టి రాజేంద్ర, పసుపులేటి రవి, యడ్లపల్లి బుజ్జి, సోమిశెట్టి రాఘవ, పినిశెట్టి నిరంజన్, కే.చేతన్, సూదాని మాధవరావు, తోట కనకదుర్గ, బాదర్ల లోలాక్షు నాయుడు, భోగిరెడ్డి సాంబశివరావు, సోమిశెట్టి రాఘవ, రావి రాజేశ్వరరావు, బావిశెట్టి కనకదుర్గ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

100 రోజుల పని : ఏపీఓ

విశాలాంధ్ర-ఘంటసాల : ఉపాధి హామి పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి 100 దినాల పనులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఏపీవో రాజ్ కుమార్ తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఘంటసాల మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన పనులు వివరించారు. రాబోయే రోజుల్లో కొత్త పనులు గుర్తించడం, సీసీ రోడ్లు, మినీ గోకులాల నిర్మాణం, ప్రతి జాబ్ కార్డు దారునికి వంద రోజుల పని కల్పించడం, తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచులు బి.వెంకటేశ్వరమ్మ, కొణతం విజయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ మంగమ్మ, సీవో, ఏపి బాలు, సువర్ణ, గొర్రెపాటి సురేష్, ఈవో టి.జయలక్ష్మీ, ఎఫ్ఎలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జలదీశ్వరుని సేవలో హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్

విశాలాంధ్ర-ఘంటసాల: ఘంటసాలలోని శ్రీ బాల పార్వతీ సమేత శ్రీ జలదీశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి అడిషనల్ డీజీ అమరావతి వారు దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు .వారికి ఆలయ మర్యాదలతో , కృష్ణాజిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ దేవాలయ శేష వస్త్రం , దేవాలయ ప్రతిమ అందించారు . ఆలయ అర్చకులు చావాలి కృష్ణకిషోర్ పూజాదికాలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు . నాగాయలంక సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్ తదితర ,పోలీస్ శాఖాధి కారులు పాల్గొన్నారు

జాతిపితకు ఘన నివాళులు

విశాలాంధ్ర-పెడన : జాతిపిత పూజ్య బాపూజీ మహాత్మా గాంధీ జయంతి వేడుకలు పెడన పురపాలక సంఘ కార్యాలయం, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద విగ్రహమునకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్పర్సన్ కటకం నాగ కుమారి ప్రసాద్ పెడన పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం : సర్పంచ్ రాము

విశాలాంధ్ర-ఘంటసాల: చిన్న కళ్ళేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వి. వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని పంచాయతీ సర్పంచ్ గుత్తికొండ రామారావు (రాము) బుధవారం పేర్కొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్లుగా గ్రామపంచాయతీ పరిధిలో మేము చేసిన ప్రతి అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశాడని ఆయన పంచాయితీకి సేవలు నిరూపమానం అన్నారు. ఉద్యోగంలో బదిలీలు సర్వసాధారణమని, కానీ ఆయన బదిలీ కావటం ఎంతో బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సర్పంచ్ రామారావు ఆకాంక్షించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

వ్యాధిని సరైన సమయంలో గుర్తించాలి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: ఆహారపు అలవాట్లను మార్చుకోవడంతో పాటు సరైన సమయంలో వ్యాధిని గుర్తించి మారుతున్న జీవన శైలి కి అనుగుణంగా సరైన వైద్యం పొందాలని ఆరుష్ రుమటాలాజీ, ఇమ్యూటాలాజీ క్లినిక్ డాక్టర్ యోగిత సూచించారు.ప్రస్తుత పరిస్థితుల్లో 30 సంవత్సరాలు పైబడిన వారిలో కూడా మోకాళ్ల నొప్పులు సమస్య ఎ క్కువగా కనిపిస్తుందనీ అన్నారు.ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలి, జన్యుపరమైన తదితర కారణాలవల్ల ఈ సమస్య ఏర్పడుతుందనీ సరైన వైద్యం ద్వారా కీళ్ళ నొప్పులకు స్వస్తి చెప్పొచ్చని పేర్కొన్నారు. బందర్ రోడ్డు తులసి నగర్ గడ్డం రత్తయ్య వీధిలో కీళ్ల నొప్పులతో బాధపడే వారి కోసం ఉచిత బోన్ మినరల్ డెన్సిటీ టెస్ట్, రుమటాలజీ టెస్ట్, తదితర వాటిపైనా ఆరుష్ రుమటాలజీ మరియు ఇమ్యూటాలజీ క్లినిక్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తులసి నగర్ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది ఈ వైద్య శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందటతోపాటు ఉచితంగా మందులు పొందారనీ చెప్పారు. స్థానికల నుండి ఈ వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించిందన్నారు.

ప్రపంచానికి మహాత్మా గాంధీ జీవితం ఆదర్శప్రాయం

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ప్రపంచానికే ఆదర్శప్రాయమని మహాత్మా గాంధీ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షులు రాంపిళ్ల జయప్రకాష్ అన్నారు. బుధవారం విజయవాడ పాలఫ్యాక్టరీ సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల ప్రాంగణంలో ఉన్న మహాత్మా గాంధీ దేవాలయంలో గాంధీ జయంతి వేడుకలు, గాంధీ దీక్షల మాల విరమణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు రాంపిళ్ల జయప్రకాష్ మాట్లాడుతూ సత్యం అహింసలే ఆయుధాలుగా మహాత్మా గాంధీ భారతదేశానికి స్వాతంత్రం తీసుకువచ్చిన మహనీయుడని కొనియాడారు. తన తాత సయ్యద్ రాంపిళ్ల అప్పలస్వామి, తన తల్లిదండ్రులు సర్దార్ రాంపిళ్ల సూర్యనారాయణ- నరసాయమ్మ దంపతులు స్వాతంత్రం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులని, వారి బాటలోనే వారి వారసులుగా తమ కుటుంబం గాంధీ మార్గంలో పయనిస్తోందని చెప్పారు. ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో మహాత్మా గాంధీ పాత్ర ఎనలేనిదని కొనియాడారు. మహాత్ముని సిద్ధాంతాలను ప్రపంచమంతా గుర్తించి, గౌరవిస్తుందని అన్నారు.ప్రముఖ గాంధీయవాది ఉప్పులూరి లక్ష్మీనారాయణ పండితులు మహాత్మా గాంధీ ఆలయంలో గాంధీ హోమం నిర్వహించి పూజాదికాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన హనుమ, తమ్మిన సోనియా, ప్రముఖ వ్యాపారవేత్త తమ్మిన మారుతి, డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బి. వసంత్ కుమార్, కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, సభ్యులు టి. రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఇ-వేస్ట్ కలెక్షన్ సెంటర్‌గా 'గుడ్లవల్లేరు'

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో గాంధీ జయంతి ని పురస్కరించుకుని గ్రామ సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా గుడ్లవల్లేరు మండల పరిషత్ పరిపాలన అధికారి మొహమ్మద్ ఇమ్రాన్, గుడ్లవల్లేరు పంచాయితీ కార్యదర్శి నరసింహారావు, ఎంజిఎన్ఆర్జిఎస్ ఎపిఓ రాం ప్రసాద్, గుడ్లవల్లేరు మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుడ్లవల్లేరు పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇ-వెస్ట్ ఔట్ లెట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ గుడ్లవల్లేరు పంచాయితీని ఇ-వెస్ట్ కలెక్షన్ సెంటర్ గా కృష్ణాజిల్లా కలెక్టర్ ఆమోదించారని తెలిపారు. మండలంలోని అన్ని పంచాయితీలలో సేకరించిన ఇ-వెస్ట్ మొత్తాన్ని గుడ్లవల్లేరు పంచాయితీకి చేర్చి అనంతరం కలెక్టర్ ఆదేశాలతో వాటిని ఇక్కడి నుండి వాటి కేంద్రాలకు తరలిస్తామని అన్నారు. అనంతరం ఎంజిఎన్ఆర్జిఎస్ ఏపీఓ రాం ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టే ఉపాధి హామీ పనులను గుర్తించేందుకు ప్రజల అభిప్రాయాలను, స్థానిక పరిస్థితులను పరిగణన తీసుకుని వాస్తవ ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. అలాగే తోటల పెంపకంలో భాగంగా 5 ఎకరాల లోపు ఉత్సాహవంతులైన రైతులకు మామిడి, జామ, నిమ్మ, పామాయిల్ మొక్కలను మరియు 25 సెంట్ల నుండి 5 ఎకరాల లోపు రైతులకు గులాబీ, మల్లె మొక్కలను 3 సంవత్సరాల వరకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుండి అందిస్తామని తెలిపారు. అలాగే రైతుల అభ్యర్థన మేరకు ఫార్మ్ పౌండ్స్ ను కూడా ఈ ఉపాధి హామీ పథకం క్రింద చేయించడం జరుతుందని ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు పంచాయితీ సిబ్బంది, గ్రామ సచివాలయాల సిబ్బంది, వెలుగు సిబ్బంది, ఎన్ఆర్జియస్ సిబ్బంది, గుడ్లవల్లేరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెదలంక డ్రైన్‌లో యువకుడి గల్లంతు

విశాలాంధ్ర-కృత్తివెన్ను : కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుండి వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తూ పెదలంక డ్రైన్ లో పడి గల్లంతైన సంఘటన గరిశపూడిలో అండర్ టన్నెల్ వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దాసరి భరత్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుండి బయటకు వెళ్ళాడు. కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి పెదలంక డ్రైన్ లో పడిపోయినట్లు ప్రత్యేక సాక్షులు తెలియజేస్తున్నారు. చుట్టు పక్కల ఉన్న వేటగాళ్లు పడవలతో వెళ్లి గాలించినా యువకుడు ఆచూకీ దొరకలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కుమారుడు ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. యువకుడి గల్లంతతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

నేడు ఎమ్మెల్యే వెనిగండ్ల రాముచే కలశ స్థాపన

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు వైభవంగా జరగనున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3వ తేదీ ఉదయం గం.8.54ని.లకు కలశ స్థాపన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముచే జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబందించిన ఏర్పాట్లు గురించి కొండలరావు దేవస్థానము అర్చకులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేసినారు. అతిధులకు ప్రసాదం ఏర్పాట్లు చేయటం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో నేడు శ్రీ అమ్మవారికి చేయు అలంకరణ గురించి చర్చించుట జరిగినదని ఆయన తెలిపారు.

మర్రివాడ అంగన్వాడీ పోస్టు కి నోటిఫికేషన్

విశాలాంధ్ర-పమిడిముక్కల: ఐసిడిఎస్ పామర్రు సెక్టార్ పరిధిలోని మర్రివాడ లో అంగన్వాడీ కార్యకర్త పోస్టు (ఎస్. సి)భర్తీ కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పామర్రు సెక్టార్ ఐసిడిఎస్ అధికారి వి.భానుశ్రీ తెలిపారు.ఈ సందర్భంగా ఈ నెల 10 తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని మిగతవివరాలు కార్యాలయం లో సంప్రదించవచ్చని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ జయంతి ఘనంగా నిర్వహించారు అలాగే స్వచ్ఛత హి సేవ భాగంలో పారిశుధ్య సిబ్బందికి సన్మానించారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొమ్మరాజు సుధీర్ యంపిటిసి సభ్యులు పడమట రంగారావుమద్దినేని వెంకటేశ్వరవు యండి ఓ సత్యకుమార్, పాల్గొన్నారు.తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు

తల్లిదండ్రులను దగ్గరుండి చూసుకోవాలి : యార్లగడ్డ

విశాలాంధ్ర-గన్నవరం : పిల్లలు తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో దగ్గరుండి చూసుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందినట్లు అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు బుధవారం వృద్ధుల దినోత్సవం సందర్భంగా మండలంలోని చిన్న వట్టిపల్లి పుణ్య చారిటీస్ వృద్ధ ఆశ్రమం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులను తస్కరించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధన్ రావు పుణ్య జాతి కార్యదర్శి జాస్తి శశిభూషణ్ పెద్దలు పాల్గొన్నారు.

మాజేరులో పంట నష్టం వివరాలు సేకరణ

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండలం మాజేరు లో పంట నష్టపరిహారం రీ సర్వే బృందం బుధవారం నష్టపోయిన రైతుల వివరాలను రూపొందించారు. పంట నష్టం రానివారు, నష్టపోయిన రైతుల పేర్లు నమోదు కాకుంటే వారి వివరాలతో జాబితా రూపొందించేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం ఇచ్చిన నేపధ్యంలో వ్యవసాయశాఖ అధికారులు మాజేరులో పర్యటించి రైతుల వివరాలు సేకరించారు. ఏడీఏ శ్యామల, ఏవోలు సాయిసింధు, శివప్రసాద్, మురళీకృష్ణ, రామ్మోహన్రావు, వీఏఏలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సబ్ జైల్లో ఖైదీలకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-గన్నవరం : గాంధీజీ సందర్భంగా గన్నవరం సబ్ జైల్లో ప్రముఖ న్యాయవాది వెంకటరమణ ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు తొలుత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం సబ్ జైల్లో కు ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో అడ్వకేట్ నల్లమోతు రమేష్ భారతి రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): విజయవాడ కళేశ్వరరావు మార్కెట్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగింది. నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జ్ ముప్పా మోహన్రావు, ఏపీసీసీ వైస్ ప్రెసిడెంట్ గురునాథం తదితర నాయకులు పాల్గొన్నారు.

సంపాదకీయం

హే మహాత్మా!

లదాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి ఇవ్వాలని కోరుతూ వందమందితో సోనం వాంగ్చుక్ దిల్లీలో గాంధీ జయంతి రోజున ఆయన సమాధిదాకా వెళ్లాలని ప్రయత్నిస్తే మోదీ ప్రభుత్వం వారందరినీ గత సోమవారం అరెస్టు చేసింది. ఈ లోగా రెండు అత్యాచార కేసులు, రెండు హత్య కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్ష పడ్డ దేరా సచ్చా అధిపతి గుర్మీత్ రాం రహీం సింగ్ కు గత నాలుగేళ్ల కాలంలో పెరోల్ మంజూరు అయింది. హర్యానా శాసనసభ ఎన్నికల కోసమే ఆయనకు పెరోల్ మంజూరు చేశారని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అలాంటిది శాంతియుత ప్రదర్శన చేస్తూ గాంధీ సమాధి దగ్గర నివాళి అర్పించడానికి బయలుదేరిన సోనం వాంగ్ చుక్‌ను దిల్లీ పొలిమేరల్లోనే అరెస్టు చేశారు. "మేం శాంతియుతంగా బాపూ సమాధి దగ్గరకు వెళ్దామని అనుకుంటే ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో మమ్మల్ని నిర్బంధించారు...హే రాం" అని వాంగ్ చుక్ "ఎక్స్" (ఇదివరకు ట్విట్టర్ వేదిక మీద ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాంగ్ చుక్‌తో సహా ప్రదర్శన చేసిన వారిని మంగళవారం వదిలేయాలనుకున్నారట. వారిని జైలు నుంచి బస్సెక్కించి తీసుకెళ్లి మళ్లీ జైలుకే తీసుకొచ్చారట. లదాఖ్ పర్యావరణానికి ముప్పుఉందని వాంగ్ చుక్ చాలా రోజుల నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లదాఖ్ కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని కోరుతున్నారు. కానీ ఆయన ఎవరిని ఇలా అభ్యర్థిస్తున్నారో ఆలోచించినట్టు లేదు. అయిదేళ్ల కింద జమ్మూ-కశ్మీర్ తో సహా లదాఖ్ కు ఉన్న రాష్ట్రప్రతిపత్తిని కాజేసి ఆ ప్రాంతంలో రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేసిన మోదీ సర్కారును అభ్యర్థించడం వృథా ప్రయాస అని ఆయనకు తట్టినట్టు లేదు. మహాత్మా గాంధీ సమాధి సందర్శించి శ్రద్ధాంజలి అర్పించడం కూడా ఎంత కష్ట సాధ్యం అయిందో మోదీ ఏలుబడిలో ప్రజాస్వామ్యాన్ని చూస్తే అర్థం అవుతుంది. సోనంను నిర్బంధించడం ఆమోదించగలిగింది కాదని ఇది రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాల రాయడమేనని లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాహుల్‌ను అణచి వేయాలని ప్రయత్నిస్తున్న మోదీ ప్రభుత్వం ఆయన విమర్శను పెడచెవిన పెడ్తుందనుకోవడమే భ్రమ. దిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు మంగళవారం వాంగ్‌చుక్ ను ఆయన అనుచరులను కలుసుకోవడానికి చేసిన ప్రయత్నాన్నీ మోదీ ప్రభుత్వం అంగీకరించలేదు.

వాంగ్ చుక్ ఆయన సహచరులతో సహా దిల్లీ వస్తున్నారని పసిగట్టిన వెంటనే దిల్లీలో నిషేధాజ్ఞలు అమలు చేశారు. ఈ నిషేధాజ్ఞల ప్రకారం అయిదుగురికన్నా ఎక్కువగా ఒక చోట గుమి కూడడానికి వీల్లేదు. ఈ ఆజ్ఞను ఆసరాగా చేసుకుని వాంగ్ చుక్ తదితరులను నిర్బంధించారు. శాంతియుత ప్రదర్శనకు కూడా మన "ప్రజాస్వామ్యం" అనుమతించని దుస్థితిలో ఉన్నాం. వాంగ్ చుక్ నాయకత్వంలో ఈ యాత్ర దాదాపు నెల కింద ప్రారంభమైంది. లదాఖ్ కు రాష్ట్ర ప్రతిపత్తితో పాటు, ఆ ప్రాంతానికి రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూలును అమలు చేయాలని, లదాఖ్ కు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని, లేహ్-కార్గిల్ కు ప్రత్యేకంగా లోకసభ నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని వాంగ్ చుక్ నాయకత్వంలోని లేహ్ కేంద్ర సంస్థ కోరుతోంది. గాంధీ జయంతి రోజు ఈ ప్రదర్శన ముగియాల్సి ఉండింది. కానీ గాంధీ సమాధికి వెళ్లడాన్ని కూడా మోదీ ప్రభుత్వం సాగనివ్వలేదు. చివరకు ప్రభుత్వం సోనం వాంగ్‌చుక్‌ను, ఆయన సహచరులను బస్సుల్లో రాజ్‌ఘాట్‌కు తీసుకెళ్లింది.

ఈ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ అరెస్టు అయిన వారు అందరూ పోలీసు స్టేషన్లలోనే నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమను జాతి ద్రోహులుగా పరిగణిస్తారా అని నినదిస్తున్నారు. లదాఖ్ ప్రజలు తమ సమస్యను శాంతియుత సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలనుకుంటున్నారని వాదిస్తున్నారు. ఇలాంటి వాదనలు నిరంకుశత్వం అమలు అవుతున్న దేశంలో ఎందుకు అమలు అవుతాయి గనక! గాంధీ జయంతి రోజు గడిచిపోవడానికి ఇంకా సమయం ఉంది కనక అది జరిగేదాకా వీరిని విడుదల చేయకపోవచ్చు. అప్పటిదాకా వీరు నిర్బంధంలో ఉండాల్సిందే అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒక పోలీసు అధికారి ఉన్న మాట చెప్పారు. సోనం వాంగ్ చుక్ దగ్గర ఉన్న మొబైల్ ఫోన్ కూడా పోలీసులు లాగేసుకున్నారు. వాంగ్ చుక్ ఎన్నడూ హింసాత్మక చర్యలకు పాల్పడ్డ వారుకాదు. వృత్తి రీత్యా ఆయన ఇంజనీరు. పర్యావరణానికి ఉపయుక్తంగా ఉండే మార్గాలు అన్వేషిస్తుంటారు. ఆయనకు రామన్ మెగసెసే అవార్డు కూడా వచ్చింది. లదాఖ్ ప్రజల జీవనం సుఖమయంగా ఉండడానికి అనువైన వస్తువులను, పరికరాలను రూపొందిస్తుంటారు. ఆయన ఏ కార్యక్రమం చేపట్టినా నిర్మాణాత్మకంగానే ఉంటుంది. ఆయన వ్యవహార సరళికి ముచ్చట పడడంతో ఆగి పోకుండా స్ఫూర్తి పొంది అమీర్ ఖాన్ 2009లో త్రీ ఇడియట్స్ సినిమా కూడా రూపొందించారు. పరిపాలనలో లదాఖ్ కు స్వయంప్రతిపత్తి ఉండాలని కోరుకుంటారు. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూలు ప్రకారం లదాక్ కు 2019లో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ రాం ముండాకు వాంగ్ చుక్ లేఖ రాశారు. ఈ విషయం తమ మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఈ విషయం తెలియజేశామని కూడా గిరిజన సంక్షేమ శాఖమంత్రి వాంగ్ చుక్ రాసిన లేఖకు సమాధానం ఇస్తూ చెప్పారు. కానీ దీనిపై ఆ తరవాత ఏ ప్రస్తావనా రాలేదు. 2019లో లదాఖ్ కు ప్రత్యేక ప్రతిపత్తి, పరిపాలనలో స్వతంత్రత కావాలన్న అంశంపై విద్యార్థులు నిరసన ప్రదర్శనలు తెలియజేశారు. దానికి మాజీ ఎంపీ తుప్స్తన్ చెవాంగ్ మద్దతు కూడా లభించింది. ఆ తరవాతే లే కేంద్ర సంస్థ ఏర్పడించి. కార్గిల్ లో కూడా ఈ ఉద్యమ ప్రతిధ్వనులు వినిపించాయి. కార్గిల్ ప్రజాస్వామ్య కూటమి ఏర్పడింది. ఆ ప్రాంతాన్ని ఆరవ షెడ్యూలులో చేరుస్తామని బీజేపీ 2019 లోకసభ ఎన్నికల సమయంలో వాగ్దానం చేసింది. ఈ వాగ్దానాన్ని నెరవేర్చాలని మాత్రమే వాంగ్ చుక్ కోరుతున్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అడిగే వారిని మోదీ ప్రభుత్వం సహిస్తుందనుకోవడం దండగ. లదాఖ్, లేహ్ ప్రాంతాలను ఆరవ షెడ్యూలులో చేరిస్తే అక్కడ స్వయంప్రతిపత్తిగల జిల్లా పాలనా మండళ్ల ఏర్పాటు చేయడానికి అవకాశం వస్తుంది. ఈ మండళ్ల భూమి, అడవులు, నీరు, వ్యవసాయం, గ్రామ మండళ్లు, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, గ్రామ-పట్టణ స్థాయిలో పోలీసు వ్యవస్థ మొదలైన అంశాలలో చట్టాలు కూడా చేసే అవకాశం వస్తుంది. అస్సాం, మేఘాలయ, మిజోరం, త్రిపురలో ఇలాంటి స్వయం ప్రతిపత్తి గల మండలాలు పది ఉన్నాయి. వాంగ్ చుక్ కోర్కెల సాధ్యాసాధ్యాలు చర్చనీయ అంశాలు కావొచ్చు కానీ గాంధీ జయంతి రోజున ఆయన సమాధిని దర్శించే అవకాశం లేకుండా చేయడం సంపూర్ణంగా ప్రజాస్వామ్య విరుద్ధమైందే. ఇది మోదీ ప్రభుత్వంలో గూడు కట్టుకున్న భయానికి సంకేతం.

అదృష్ట జాతకుడు బాబా రాం రహీం

జైలులో ఉన్నవారే ఎన్నికలలో పోటీ చేయడానికి వీలైతే గెలవడానికి అవకాశం ఉన్నప్పుడు ఎన్నికల ఆపత్కాల సమయంలో జైలులో ఉన్నవారు ఉపయోగ పడతారని పాలకవర్గం భావిస్తే జైలులో ఉన్నవారు ఎలాంటి వారైనా బలాదూరుగా తాత్కాలిక ప్రాతిపదికపై విడుదల కావొచ్చు. దీనినే పరిపాలనా భాషలో పెరోల్ అంటారు. ఆ సౌభాగ్యం రెండు అత్యాచార కేసులు, రెండు హత్య కేసుల్లో దోషిగా తేలిన దేరా సచ్చా బాబాగా చెలామణి అయ్యే గుర్మీత్ రాం రహీం సింగ్ కు దక్కినట్టు ప్రసిద్ధ సినీ నటుడు సంజయ్ దత్ జైలులో ఉన్నప్పుడు కూడా దక్కినట్టులేదు. ఎప్పుడు ఎన్నికలు వస్తే అప్పుడు దేరా సచ్చా బాబాకు పెరోల్ మంజూరు అవుతుంది. ఆయన జైలుకెళ్లి నాలుగేళ్లు అయింది. ఈ లోగా ఆయనకు పదకొండు సార్లు పెరోల్ మంజూరు అయింది. ఆ సందర్భాలన్నీ ఎన్నికలు జరిగినప్పటివే.హర్యానా శాసనసభకు వచ్చే అయిదో తేదీన అంటే శనివారం పోలింగ్ జరగాల్సి ఉంది. గత పదేళ్ల నుంచి హర్యానాలో అధికారంలో ఉన్న బీజేపీకి ప్రస్తుతం గడ్డుకాలం ఉందంటున్నారు. గడ్డు కాలంలో భగవంతుడు ఆదుకుంటాడో లేదో తెలియదు కాని భగవత్ స్వరూపులు కచ్చితంగా అక్కరకు వస్తారని బీజేపీ అగ్ర నాయకులకు తెలుసు. అందుకే జైలు అధికారులు వివిధ రాష్ట్రాలలో లక్షలాది మంది భక్తులు ఉన్న రాం రహీం సింగ్ కు పెరోల్ మంజూరు చేశారు. జైలులో ఉన్న నాలుగేళ్ల కాలంలో ఏదో ఒక సాకుతో రాం

ఒకే ఒక్కడు

రహీం సింగ్‌కు పెరోల్ మంజూరు అవుతూనే ఉంది. ఇప్పటికి 275 రోజుల పాటు బాబా రహీం సింగ్ పెరోల్ మీద విడుదలయ్యారు. ఇప్పుడూ అలాగే హర్యానా శాసనసభ ఎన్నికల సమయంలో పెరోల్ మంజూరు అయింది. అయితే లాంఛనంగా సదరు బాబా హర్యానాలో కాలు పెట్టకూడదని ఆంక్ష విధించారు. భగవదాంశ ఉన్నవారు నాలుగు అడుగుల దూరంలో ఉంటే మాత్రం వారి ప్రభావం ఉండకుండా పోదు కదా! 1948 ఏప్రిల్ 29వ తేదీన మస్తాన్ బెలూచిస్తానీ దేరా సచ్చా సౌదా ఏర్పాటు చేశారు. ఆయన ఉద్దేశం ఏమైనా కావచ్చు. కాని ప్రస్తుతం దేరా సచ్చా సౌదా అధిపతి రాం రహీం సింగ్ కు మాత్రం అపారమైన భక్తుల మద్దతు ఉంది.

ఆయన కీర్తి కిరీటంలో ఉన్న విశేషణాలను చూస్తే ఎంతటి "ప్రతిభావంతుడో" ఇట్టే అర్థమై పోతుంది. ఆయనను ఆధ్యాత్మిక సన్యాసి, దాత, ప్రామాణిక గాయకుడు, సర్వ క్రీడా పారంగతుడు, సినీ దర్శకుడు, నటుడు, కళా దర్శకుడు, సంగీత దర్శకుడు, రచయిత, గేయ రచయిత మొదలైన విశేషణాలతో పిలిచి భక్తులు తరిస్తుంటారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే బాబా రహీం సింగ్ సర్వకళా పారంగతుడు. అన్నింటికీ మించి బాబా. అలాంటి పలుకుబడి ఉన్న వ్యక్తిని ఎన్నికల ప్రయోజనాలకు వినియోగించుంటే అది బీజేపీకి అందుబాటులో ఉన్న ఉత్తమ ఎత్తుగడ అని సరిపెట్టుకోవలసిందే. ఎదురీదాలనుకుంటే దేశద్రోహుల ముద్ర భరించవలసిందే. ఈ సారి గుర్మీత్ హర్యానా శాసనసభ ఎన్నికలు కలిసొచ్చేలా 20 రోజుల పెరోల్ ఇవ్వాలని పెట్టుకున్న అభ్యర్థనను ఔదార్యానికి ప్రతిరూపాలైన జైలు అధికారులు తక్షణం ఆమోదించేశారు. ఆయనను విడుదల చేశారు. పేరుకు హర్యానాలో ప్రవేశించకూడదని షరతు మాత్రం పెట్టారు. ఆయనకు పెరోల్ ఇవ్వడానికి కారణం ఏమిటో చెప్పాలని ఎన్నికల కమిషన్ అధికారులు తమ విధ్యుక్త ధర్మంగా ప్రశ్నించారు. కానీ బాబా రహీం విడుదల ఏ లక్ష్యంతో, ఎవరి పనుపున జరుగుతోందో ఎన్నికల కమిషన్‌కు తెలియదనుకోలేం. బర్నాలో ఉన్న తన ఆశ్రమంలో కొన్ని పనులున్నాయి కనక పెరోల్ మంజూరు చేయాలని బాబా చెప్పిన మాటను జైలు అధికారులు మనస్ఫూర్తిగా నమ్మేసి పెరోల్ మంజూరు చేశారు. అంతకు ముందు పెరోల్ మీద విడుదలై ఆయన జైలుకెళ్లిన మూడు వారాల్లోనే మరోసారి పెరోల్ మంజూరు అయింది. దీని వెనక ఉన్న మతలబు ఏమిటో ఊహాశక్తి ఉన్న వారికందరికీ ఇట్టే అర్థం అయిపోతుంది. ఆగస్టు 13న ఆయనకు పెరోల్ మంజూరు అయింది. మళ్లీ గత 30వ తేదీన ఆయన ఉత్తరప్రదేశ్‌లోని బన్వారాలో తన ఆశ్రమ పనులు చక్కబెట్టుకోవడానికి విడుదల చేశారు. నిజానికి ఈ రెండు సందర్భాలలో ఆయనను విడుదల చేయడం వెనక ఆంతర్యం హర్యానా శాసనసభ ఎన్నికలే. గత లోకసభ ఎన్నికల సమయంలో జనవరిలో 20 రోజులు, రాజస్థాన్ ఎన్నికలప్పుడు 2021 నవంబర్ 21 న 20 రోజులు, హర్యానా పంచాయితీ ఎన్నికలప్పుడు 2023 జులై 20న 30 రోజులు, హర్యానా పంచాయితీ ఎన్నికల సమయంలో 2023 జనవరిలో 40 రోజులు, అదంపూర్ ఉప ఎన్నికలప్పుడు 2022 అక్టోబర్ 15న 40 రోజులు, హర్యానా మునిసిపల్ ఎన్నికల సమయంలో 2022 జూన్ 17న 30 రోజులు, 2022 ఫిబ్రవరి 7న పంజాబ్ ఎన్నికల సమయంలో 21 రోజులు బాబా రహీం సింగ్ కు పెరోల్ మంజూరు అయింది. ఆయన్ను అత్యవసర పనులకోసం 2021 మే 21 న ఒక్కరోజు, 2020 అక్టోబర్ 24న ఒక్క రోజు మాత్రమే పెరోల్ మీద విడుదలయ్యారు. సొంత పనులకు ఈ నాలుగేళ్ల కాలంలో కేవలం రెండు రోజులే పెరోల్ ను వాడుకున్న బాబా రాం రహీం నిస్వార్థతను ఎన్ని నోళ్లతో పొగిడినా తక్కువే. ఆయన ఎప్పుడు పెరోల్ అడిగినా, లేదా తమ విజయావకాశాలు పెంపొందింప చేసుకోవడానికి మోదీ ప్రభుత్వం ఆయనకు ఎన్నిసార్లు పెరోల్ ఇప్పించినా ఎన్నికల తరుణంలో అత్యాచారాలకు పాల్పడేవారు, హత్యలు చేసినవారు "ప్రజాస్వామ్య ఉద్ధరణకు" ఎంతగా తోడ్పడతారో ఇట్టే అర్థమై పోతుంది. గుజరాత్ మారణకాండ సమయంలో బిల్కిస్ బానో కుటుంబలో అనేక మందిని హతమార్చి ఆమె కళ్ల ముందే మూడేళ్ల చిన్నారిని బండకేసి బాది ప్రాణాలు తీసిన కిరాతకులకు జైలుశిక్ష పడితే జైలులో వారి సత్ప్రవర్తనకు మెచ్చి విడుదల చేసిన బీజేపీ ప్రభుత్వ ఔదార్యాన్ని ఎలా విస్మరించగలం! మనం చేయగలిగిందల్లా విచ్చలవిడిగా అత్యాచారాలకు, హత్యలకు పాల్పడిన వారిని ఎన్నికలలో గెలుపు కోసం ఎలా వినియోగించుకోవచ్చో నిరూపిస్తున్న బీజేపీ క్షమాగుణాన్ని వేనోళ్లతో పొగడడమే. ఎన్నికల విజయానికి కరడుగట్టిన నేరస్థులు ఎంత భేషుగ్గా ఉపయోగ పడ్తారో గ్రహించడమే. మోదీ హయాంలో ప్రజాస్వామ్యం "పరిఢవిల్లుతున్న" తీరును, సృజనాత్మకతను చూసి మురిసి పోవడమే. మోదీ ప్రజాస్వామ్య ప్రవాహానికి ఎదురీదాలనుకుంటే దేశ ద్రోహుల జాబితాలో పేరు నమోదు చేయించుకోవలసిందే.

అనన్య వర్మ

రైతులకు సాయమేది?

డా. ముచ్చుకోట సురేష్ బాబు

గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం రాష్ట్రంలో చిన్న, సన్నకారు కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన కష్టమర్ హైరింగ్ సెంటర్ పథకం అటకెక్కింది. కేవలం ఒక వర్గం ప్రయోజనంకోసం రైతు భరోసా కేంద్రాలు వెలసినట్లు కనిపిస్తుంది. ఆర్బికే ద్వారా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, రసాయనాలు, రైతులకు పనిముట్లు, వ్యవసాయ ఉపకరణాలు తక్కువ ధరలకు అందించే విధంగా రూపకల్పన చేసాము అని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం అవి సక్రమంగా నిర్వహించక అభాసుపాలైంది. రైతులకు చేరువలో ప్రభుత్వాలని ప్రగల్భాలు తప్ప ఆచరణలో శూన్యం. పెట్టుబడి సహాయం ప్రతి రైతుకు ఇరవైవేలు ఇస్తామన్న ప్రభుత్వం మాట మరిచింది. ఫల సంప్రదాయం రైతులకు కత్తెర, కట్టర్, వ్యవసాయ పనిముట్లు ఇవ్వాల్సిన హార్టికల్చర్ శాఖ అధికారుల జాడే లేదు. మూడు సంవత్సరాల క్రితం ఇంకుడు గుంతలు, కట్ట కాలువలు, ఇంజెక్షన్ బావులు, వ్యవసాయ పనులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇంతవరకు ఇవ్వలేదు.

నాబర్డ్ ఎవరి ప్రయోజనాలకోసం పనిచేస్తుందో అర్థంకాదు. సోలార్ కోల్డ్ స్టోరేజ్‌లు ఎగవేతదారులకు, కార్పొరేట్ వ్యవసాయంచేసే మోతుబరి రైతులకు అప్పజెప్పారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా పశుపోషణ, పొట్టేళ్ల పెంపకం, గేదెలు, ఆవులు పాడి పరిశ్రమకు ఏ రోజైన దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాకు 20కోట్లు ఇస్తే అది కేవలం ఎంపీ, ఎంఎల్‌ఏలకు, రాజకీయ నాయకులకు వరంగా మారింది. నిజమైన రైతులకు అన్ని ప్రతికూలతలే. రైతు డిటైల్డ్ ప్రాజెక్ట్ నివేదిక ఇవ్వాలి. మూడు సంవత్సరాలు ఐటి రిటర్న్స్ ఇవ్వాలి. బ్యాంకు అధికారులతో లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో సఖ్యత ఉండాలి. ప్రాజెక్ట్ అమలు అధికారుల ద్వారా కొల్లేటరల్ సెక్యూరిటీ ఉండి పైరవీలు చేయించుకుంటే వచ్చేది గగనం. పాలి హౌస్, వేర్ హౌస్, మాడ్యులర్ సోలార్ స్టోరేజ్ యూనిట్ల నిర్మాణానికి ఇంతవరకు మంజూరు కాలేదు. భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో కూడిన రంగాలు దేశ జీడీపీలో దాదాపు సగానికి దోహదం చేస్తాయి.

విలువ గొలుసు అంతా అసమర్థతను పరిష్కరించే కంపెనీలు వృద్ధి సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. కొత్త తరాల రైతులు పగ్గాలు చేపట్టినందున, వ్యవసాయ విలువ వ్యవస్థ సాంకేతికత పెద్ద పాత్ర పోషిస్తుంది. ఈ రంగానికి ఫైనాన్సింగ్‌కు వేగవంతమైన మెరుగైన అందుబాటు కూడా అవసరం. వినూత్న వ్యాపార నమూనా సాంకేతికత స్వీకరణ మైక్రోఫైనాన్స్, అగ్రి వినియోగదారు రుణాలకు అందుబాటును పెంచుతోంది. వ్యవసాయరంగం పరిపక్వం చెందుతుంది. కొత్త సవాళ్లు పెరుగుతున్నాయి. రైతు సమూహాలు ముఖ్యంగా పంటకోత తర్వాత సేవల కోసం సామర్థ్యం, స్థిరత్వం పెంపొందించుకోవాలి. పారదర్శకమైన నమ్మదగిన డేటా, ఫైనాన్సింగ్ కొత్త పద్ధతులను అవలంబించడం కోసం రైతులతో నమ్మకాన్ని పెంపొందించడం భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తుంది.

గ్రామాలు, గ్రామస్తులు అధిక పరిజ్ఞానం కలిగి ఉండి ఎప్పటికప్పుడు మారుతున్న ప్రకృతికి అనుగుణంగా జీవించడంలో వారి నైపుణ్యాన్ని అర్థం చేసుకోవడం వాటిని నిజ జీవితంలో అన్వయించుకోవడం ప్రతి రైతు కర్తవ్యం. ప్రకృతితో మమేకమవుతూ సేంద్రియ వ్యవసాయాన్ని సుస్థిర అభివృద్ధివైపు తీసుకుపోవలసిన అవసరంఉంది. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఆవిష్కరణలకు ప్రేరణ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుండి వచ్చింది. ఈ మధ్యకాలంలో గ్రామీణ ఆవిష్కరణలకు ప్రభుత్వం నుంచి ఏమాత్రం ప్రోత్సాహంలేదు. భూములలో సేంద్రియ కర్బనం తగ్గిపోయింది. దేశంలో 25 కోట్లమంది రైతులకు భూసార పరీక్షలు నిర్వహించామని గర్వంగా చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం రైతులకు ఉపయోగం కలిగించలేదు. అవసరమైన డి ఏ పి, యూరియా, విత్తన శుద్ధిచేసే ఫంగిసైడ్ సరఫరా రైతు భరోసా కేంద్రాల ద్వారా చేయలేదు.

> జిల్లాలో డ్రోన్లు ఇవ్వడానికి శ్రీకారంచుట్టి అమలు పరచక పక్కన పెట్టారు. డ్రోన్ల వినియోగం రైతులకు వ్యవసాయ అధికారులకు తెలియదు. జీరో బడ్జెట్ ఫార్మింగ్, సేంద్రియ వ్యవసాయం, సుస్థిర వ్యవసాయం, ప్రాకృతిక వ్యవసాయం అని ప్రతి రోజు ఊకదంపుడు ప్రసంగాలు చేసే అధికారులు మరోవైపు రసాయన మందులు పిచికారీ చేయడానికి డ్రోన్లను వినియోగించడం విడ్డురంగా ఉంది. డ్రోన్ల వినియోగంపై వ్యవసాయ అధికారులకు శిక్షణ లేదు.. బడ్జెట్ రిలీజ్ ఆర్డర్స్‌లో కానీ రాష్ట్ర బడ్జెట్ అవుట్‌కమ్‌లో డ్రోన్ల ప్రస్తావన లేదు

రైతు సంక్షేమం కొరకు రైతు సంఘాల ద్వారా గుంటకలు, పల్టార్, గొర్రు, రోటవేటర్, ట్రాక్టరు ఇవ్వడం జరుగుతుంది అని చెప్పిన ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అప్లికేషన్ స్వీకరించి కేవలం ఒక వర్గం రైతులకే కష్టమర్ హైరింగ్ సెంటర్లు ఇచ్చాయి. రైతు సంఘంలో విభిన్న కులాలు ఉండాలి, సంఘంలో సభ్యులు ఒకే కులము, బంధువులు, రక్త సంబంధీకులు ఉండకూడదు. కానీ చాల మండలాల్లో కేవలం ఒకే కులానికి చెందిన వారు రైతు సంఘాన్ని, కష్టమర్ హైరింగ్ సెంటర్లను లీడ్ చేస్తున్నారు. నిబంధనలన్నీ తుంగలో తొక్కి ఇతర కులాలను రైతు సంఘంలో ఉన్న వారి పాత్ర నామమాత్రమే. కష్టమర్ హైరింగ్ సెంటర్లలో లీడ్ తీసుకునే వారు వెనుకబడిన తరగతులకు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతులకు చెందిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్న సన్నకారు రైతులకు ప్రయోజనం ఉండేట్లు ప్రభుత్వ పథకాలు ఉండాలి, లేకపోతే ప్రయోజనం ఉండదు.

జిల్లాలో డ్రోన్లు ఇవ్వడానికి శ్రీకారంచుట్టి అమలు పరచక పక్కన పెట్టారు. డ్రోన్ల వినియోగం రైతులకు వ్యవసాయ అధికారులకు తెలియదు. జీరో బడ్జెట్ ఫార్మింగ్, సేంద్రియ వ్యవసాయం, సుస్థిర వ్యవసాయం, ప్రాకృతిక వ్యవసాయం అని ప్రతి రోజు ఊకదంపుడు ప్రసంగాలు చేసే అధికారులు మరోవైపు రసాయన మందులు పిచికారీ చేయడానికి డ్రోన్లను వినియోగించడం విడ్డురంగా ఉంది. డ్రోన్ల వినియోగంపై వ్యవసాయ అధికారులకు శిక్షణ లేదు.. బడ్జెట్ రిలీజ్ ఆర్డర్స్‌లో కానీ రాష్ట్ర బడ్జెట్ అవుట్‌కమ్‌లో డ్రోన్ల ప్రస్తావన లేదు. సంవత్సరాలుగా భూసార పరీక్షలు చేయలేదు. భూములు నిస్సారంచేసి రసాయన క్రిమి సంహారకాలు వినియోగం ఎక్కువయింది. భూములలో సేంద్రియ కర్బనంతగ్గి భూములు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. గతంలో మట్టి నమూనాలు సేకరించకుండా సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేశారు. 2018 వరకు కేంద్ర ప్రభుత్వ గ్రిడ్ పథకం ద్వారా సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేశాం, భూసార పరీక్షలు నిర్వహించలేదని చెబుతున్న అధికారులు, 2021 బడ్జెట్ లో రైతులకు భూసార పరీక్షలకు తర్ఫీదు ఇచ్చాము, అందుకు బడ్జెట్ కేటాయించామని చెబుతోంది. రైతు సంక్షేమం కోసం ఏర్పడ్డ ప్రభుత్వం గ్రామీణ వాలంటీర్ల ద్వారా 600 పైగా సర్వీసులు నిర్వహిస్తోందని అప్పటి ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటన చేశారు. బడ్జెట్ కేటాయింపులు లేని ప్రభుత్వ పథకాలు కేవలం ప్రచార ఆర్భాటాలకే తప్ప నిజమైన గ్రామాభ్యుదయం కనపడుటలేదు. రైతులకు తక్షణమే పంట నష్టం అంచనా వేసి, ఇన్పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, ప్రాంప్ట్ రీ పేమెంట్ ఇన్సెంటివ్ రైతుల ఖాతాల్లోకి జమ చేయాలి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, మైక్రో ఇరిగేషన్లో భాగమైన డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లు, పంపిణీ చేయాలి. వ్యవసాయ పనిముట్లకు భారీగా రాయితీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

సెల్: 9989988912

లౌకికతత్వం భారతీయ జీవన విధానం

షేక్ కరిముల్లా

'మతం అణగదొక్కివేతకు మానవుల నిట్టూర్పు. బాధాసర్పద్రష్టులైన మనషుల గాయాలకు తియ్యటి మత్తుమందు' మార్క్స్.

రాజ్యాంగబద్ధ తమిళనాడు రాష్ట్ర ప్రథమ పౌరుడు, గవర్నర్ ఆర్ ఎన్ రవి కన్యాకుమారిలో హిందూధర్మ విద్యాపీఠ్‌లో జరిగిన కార్యక్రమంలో 'భారతదేశంలో లౌకిక విధానానికి స్థానం లేదని, ఇది యూరోపియన్ భావన' అంటూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని తిరస్కరిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇది అత్యంత తీవ్రమైన విషయం. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని ప్రమాణం చేసి, అధికారం చేపట్టిన ఈ గవర్నర్ ఒక్క క్షణం కూడా ఆ పదవిలో కొనసాగటం తగదు.

'భారత దేశ ప్రజలమైన మేము, ఈ దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్యం, గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, భారత ప్రజలందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించి వారిలో భావప్రకటన, విశ్వాసం, ధర్మంతో ప్రజలకు ఆర్థిక, రాజకీయ, సమానత్వాన్ని సాధించి, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ, సోదరభావం పెంపొందించుకోవడానికి మనం రాజ్యాంగంలో రాసుకొని, ఆమోదించి మాకు మేము సమర్పించుకుంటున్నాం' అని రాజ్యాంగ పీఠిక స్పష్టంగా చెబుతుంది. బహుళత్వం గల భారతదేశంలో లౌకికతత్వం దేశం అత్యంత ప్రత్యేక లక్షణం. కొన్ని వందల సంవత్సరాలుగా భిన్న మతాలు, కులాలు, భాషలు, సంస్కృతులు కలిసి మెలసి జీవిస్తున్నాయి. లౌకిక తత్వం ప్రత్యేకంగా భారతజీవన విధానంగా మారిపోయింది. భారతదేశం విభిన్న మతాల, సంస్కృతుల సంగమం అని, ఒక రంగుల హరివిల్లు అన్న భావనను నేడు కొన్ని మతతత్వ శక్తులు పనిగట్టుకొని మసకబార్చే ప్రయత్నం చేస్తున్నాయి. చరిత్రను తిరగరాస్తున్నారు. అభూత కల్పనలు. పుక్కటి పురాణాలను చరిత్రగా నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగమే ఈ గవర్నర్ వ్యాఖ్యలు.

లౌకిక వాదం అంటే రాజ్యం నుంచి రాజకీయాలను, మతం నుంచి వేరుచేయడం. మతమనేది వ్యక్తిగతమైన సొంత వ్యవహారంగా ఉండాలి. రాజ్యం అన్నిమతాల నుంచి వేరుపడాలి. అన్ని మతాలపట్ల తటస్థంగా ఉండాలి. రాజ్యం అన్ని మతాలకు సమానమైన గౌరవం ఇవ్వాలి. దీని ఆధారంగానే మనం రాజ్యాంగంలో మతం, కులం, వర్గం ప్రాతిపదికగా దేశపౌరుల పట్ల ఎలాంటి వివక్ష చూపించరాదని రాసుకున్నాం. లౌకిక వాదం అనేది భారత్‌లో మాత్రమే ప్రత్యేకంగా కనిపించే లక్షణం. ఇది ఈ దేశ మూలాల్లోనే ఉంది. అశోకుడు, అక్బర్ చక్రవర్తులు హిందూ మతస్తులుకారు. అయినా వారు అన్ని మతాలను సోదరభావంతో చూశారు. లౌకిక భారతానికి గట్టి పునాదులు వేశారు. 19 వ శతాబ్దం ఆఖరులో లౌకిక వాదం ఆవిర్భవించి బలపడింది. 1857 సిపాయిల తిరుగుబాటులో ప్రజలు కులమతాలకు అతీతంగా బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఇది గమనించిన బ్రిటీష్ వారు దేశ ప్రజలను మత ప్రాతిపదికన విడగొట్టకపోతే ఈ దేశాన్ని ఎక్కువ కాలం పాలించలేమని గ్రహించారు. 1857 తర్వాత చురుగ్గా భారతీయులను కులం, మతం, భాష, ప్రాంతం వారీగా విభజన రాజకీయాలు మొదలు పెట్టారు. అప్పటి నుంచి విభజించి పాలించటం వారి విధానమైంది. వారు మతతత్వాన్ని బాగా ప్రోత్సహించారు. ఇందుకు 1906 లో ముస్లింలీగ్, హిందూ మహాసభ అనే రెండు మత సంస్థలను ఏర్పాటు చేశారు. ఈ రెండు సంస్థల పని మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలు ఏకం కాకుండా ఉద్యమాలను నిర్వీర్యపరిచి బ్రిటీష్‌వారికి మేలు చేయడమే. 1947లో దేశ విభజన సమయంలో ముస్లింలీగ్ లోని ముఖ్యులు పాకిస్తాన్‌కు వెళ్లిపోయారు. 1925 లో ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడింది. దీని రాజకీయ రూపమే బీజేపీ. ఈ సంస్థ దేశాన్ని మతతత్వంతో నింపివేయడానికి వందేళ్లుగా పనిచేస్తోంది. తద్వారా దేశ విదేశీ కార్పొరేట్ సంస్థలకు ప్రజలకు దక్కాల్సిన సమస్త వనరులను దోచుపెడుతోంది.

ప్రజాస్వామ్య లౌకిక వాద భారత రాజ్యాంగం సాక్షిగా అయోధ్యలో 1992 డిసెంబర్ 6 న బాబ్రిమసీదు నేలమట్టం చేశారు. తదుపరి గుజరాత్ మారణకాండ 2002, యూపీలోని ముజఫర్ నగర్‌లో ముస్లిం సమాజంపై దాడులు, గోసంరక్షణ పేరుతో జరుగుతున్న దాడులు, బుల్డోజర్ రాజ్ తదితర పరిణామాలన్ని భారతీయ లౌకిక చరిత్ర వారసత్వంపై దాడులే. భారత చరిత్ర చెక్కిలిపై నెత్తుటిగాయాలే. ఇలా శవాల గుట్టలపై నడుస్తూ, మతాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకొని పార్లమెంటులో రెండు సీట్ల నుంచి సీట్లు పెంచుకుని 2014లో అధికారంలోకి వచ్చింది బీజేపీ.దురదృష్టవశాత్తు సుప్రీంకోర్టు తీర్పులన్నింటిలోనూ అత్యంత ఘోరమైనదిగా అనదగిన 2019 నాటి అయోధ్య మీద ఇచ్చిన తీర్పు ద్వారా హిందుత్వ రాజకీయాలకు ఆమోదముద్ర వేసింది. ఈ తీర్పు ఇచ్చిన అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్‌ను ఆరు నెలలు తిరగకముందే బీజేపీ అస్సాం నుంచి రాజ్యసభకు ఎంపీగా పంపి ఈ పదవిని బహుమతిగా అందించింది. న్యాయమూర్తులు పదవీవిరమణ అనంతరం ఎలాంటి పదవులు చేపట్టరాదని రాజ్యాంగ నిబంధనలు చెబుతున్నాయి. దేశ అత్యున్నత న్యాయస్థానమే రాజ్యాంగంలోని లౌకిక తత్వానికి వ్యతిరేకంగా తీర్పులు ఇస్తే ఇక ఈ దేశాన్ని రక్షించేది ఎవరు? ఇక బీజేపీ వారు 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగం మీద దాడి మొదలు పెట్టారు. రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటిస్తున్నారు. ఆ పని చిన్నచిన్నగా చేస్తూ ముందుకు పోతున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ 1949 నవంబర్‌లోనే మనుస్మృతిని తప్పితే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అంగీకరించం అని ప్రకటించింది. మొత్తం రాజ్యాంగ, లౌకిక విలువల స్థానంలో హిందూ రాష్ట్రంను స్థాపించేందుకు పూనుకొంది. ఈ మత సంస్కృతికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతిని నిర్మిద్దాం. రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్య విలువలను రక్షించుకుందాం.

సెల్: 9705450705

విశాలాంధ్ర

ఎన్టీఆర్ జిల్లా

దసరాకు సర్వం సిద్ధం

నేటి నుంచి ఇంద్రకీలాద్రి పై ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): నేటి నుంచి బెజవాడ ఇంద్రకీలాద్రి పై దసరా ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో కే.రామారావు తెలిపారు. బుధవారం మహామండపంలోని 6అంతస్తులో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3వతేదీ నుంచి 12వతేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. పది రోజుల్లో అమ్మవారు పది రూపాల్లో దర్శనమిస్తారు. ఈ ఉత్సవాలు ముగిసే వరకూ అంతరాలయం దర్శనాలు రద్దు చేశారు. మొత్తం 15లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. ఈనెల 9వతేదీ మూలనక్షత్రం రోజున రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. మొదటి రోజు ఉదయం 9గంటలకు నుంచి భక్తులకు అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారని తెలిపారు. తరువాత రోజు నుంచి తెల్లవారుజామును 3గంటల నుంచి రాత్రి 11గంటల వరకు భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామని అన్నారు. 12వతేదీన నగరోత్సము ఊరేగింపు బయలుదేరి, సాయంత్రం 6గంటలకు తెప్పోత్సవం జరుగుతోందన్నారు. వినాయకగుడి నుంచి టోల్ గేటు ద్వారా కొండపైన ఓ టర్నింగ్ వరకు మూడు క్యూలైన్ మార్గములు ఏర్పాటు చేశామన్నారు. ఓం టర్నింగ్ వద్ద అదనంగా ఉచిత దర్శనం 1లైను, వీఐపీ 1, లైను కలిపి మొత్తం 5 క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. దర్శనం అనంతరం శివాలయం మెట్ల మార్గం నుంచి బయటకు వెళ్లాలని తెలిపారు. వృద్ధులకు, దివ్యాంగులకు పున్నమి ఘాట్ నుంచి వాహనాలు, వీఐపీల కోసం పున్నమి ఘాట్, అధికారులు సూచించిన స్థలం నుండి గత సంవత్సరం నిర్ణయించిన సమయంలో 28 ఇన్నోవా వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

దసరా ఉత్సవాలకు 'వీఎంసీ' శుభ్రం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నగర మేయర్ భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం. ధ్యానచంద్ర విజయవాడ మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం శుభ్రపర్చారు. పరిసరాలను పరిశుభ్రపరుస్తూ మహాత్ముని స్మరించుకున్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద కమిషనర్, మేయర్ భాగ్యలక్ష్మి గాంధీ జయంతి సందర్భంగా మహాత్మునికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గాంధీజీకి ఎంతో ఇష్టమైన స్వచ్ఛత ఇప్పుడు దేశం మొత్తం పాటిస్తోందన్నారు. ముఖ్యంగా విజయవాడ నగరపాలక సంస్థలో స్వచ్ఛత హి సేవ అంటూ సెప్టెంబర్ 17 నుండి మొదలుపెట్టి ఎన్నో కార్యక్రమాలు చేశారని, విజయవాడ స్వచ్ఛ సర్వేక్షన్‌లో కూడా గత మూడేళ్లలో సాధించిన ర్యాంకులకు పారిశుద్ధ్య కార్మికులు, ప్రజల తోడ్పాటే కారణమని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ అక్టోబర్ 2 జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుంటూ నగరాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గాంధీజీ ఎప్పుడూ ఒక మాట అనేవారని, స్వచ్ఛత గురించి మనం మాట్లాడాలంటే మనమే ముందుగా చీపిరి పట్టుకుని స్వచ్ఛతను పాటించాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు అడుగులు వేస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో నగరాన్ని ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. అనంతరం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించే సెల్ఫీ స్టాండ్లలో పారిశుద్ధ్య కార్మికులు, కార్పొరేషన్ సిబ్బందితో మేయర్, కమిషనర్ సెల్ఫీ దిగి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, సీఎంవోహెచ్ డా.రత్నావళి, సీపీ ప్రసాద్, ఎస్ఈ సత్యనారాయణ, అకౌంట్స్, ఎస్టేట్ ఆఫీసర్‌లు సత్యనారాయణ, శ్రీనివాస్, మేనేజర్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు : సీపీ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): దసరా ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకనేలా విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబు అన్నారు. బుధవారం లాయోలా ఆడిటోరియల్ గ్రౌండ్స్‌లో వివిధ జిల్లాల నుంచి బందోబస్తుకు విధులు వచ్చిన అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రకీలాద్రి పై ప్రతిష్టాత్మకంగా జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా తెలంగాణా, కర్ణాటక ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వస్తారని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దసరా వేడుకలకు ప్రత్యేక విశిష్టత, ప్రాధాన్యతలు ఉన్నాయని, దసరా ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు నగరానికి విచ్చేసే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో రొటీన్ బందోబస్త్ లాగా కాకుండా కొంత మనసు పెట్టి శ్రద్ధతో బందోబస్తు విధులు నిర్వహిస్తే భక్తుల మన్ననలతో పాటు అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని తెలియజేశారు. యూనిఫాంలో విధులు నిర్వహించే సమయంలో ఇతరులు మనల్ని గమనిస్తుంటారనే విషయం గుర్తుంచుకోవాలని, బందోబస్తు నిర్వహించే సందర్భంలో పాటించాల్సిన మార్గ దర్శకాలు, విధి నిర్వహణలో వ్యవహరించే తీరును ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది తెలుసుకోవాలన్నారు. మూడు షిఫ్టుల్లో బందోబస్తు విధులు నిర్వహించే ఏర్పాట్లు చేయడం జరిగింది. కాబట్టి మరింత సమర్ధవంతంగా బందోబస్తు విధులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది ఇతర శాఖల సిబ్బందితో గానీ వి.ఐ.పి.లతో గానీ వివాదాలకు తావులేకుండా సమన్వయం చేసుకోవాలని, ఇటువంటి బందోబస్తుల్లో సమన్వయంతో వ్యవహరిస్తే అమ్మవారి దర్శనం సజావుగా సాగుతుందన్నారు. అలాగే దర్శనానికి విచ్చేసే సాధారణ భక్తులకు మొదటిగా ప్రాధాన్యత ఇచ్చి అధికారుల నుండి క్రింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ కూడా వారితో మర్యాధగా వ్యవహరిస్తూ సక్రమంగా అమ్మవారి దర్శనం అయ్యేలా చూడాలని, అదే సమయంలో క్యూలైన్లలో ఏవిధమైన సంఘటనలకు ఆస్కారం లేకుండా క్యూలైన్లలో భక్తులు సక్రమంగా కదిలేలా కృషి చేయాలన్నారు. బందోబస్తు సందర్భంగా నిర్దేశించిన ప్రదేశంలో విధులు నిర్వహించడంతో పాటు రిలీవర్ వచ్చే వరకు పాయింటు వదలి వెళ్ళకూడదని సిబ్బందికి తెలియజేశారు. ఈ సమావేశంలో డి.సి.పి.లు. గౌతమి షాలి, ఉదయరాణి, ఉమా మహేశ్వరరాజు, కృష్ణమూర్తి నాయుడు, ఏ.డి.సి.పి.లు. జి.రామకృష్ణ, ఏ.వి.ఎల్.ప్రసన్న కుమార్, ఇతర పోలీస్ అధికారులు, ఏ.సి.పి.లు, ఇనస్పెక్టర్లు, ఎస్.ఐలు, బందోబస్తు విధులకు హాజరైన సుమారు 6000 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి అలంకారం
శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీకనకదుర్గమ్మ వారు శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారు. బాలత్రిపుర సుందరిదేవి ఎంతో మహిమాన్వితమైనది. శ్రీబాలామంత్రం సమస్త దేవీ మంత్రాల్లోకి ముఖ్యమైనది. అందుకే శ్రీవిద్యోపాసకులకి మొట్టమొదటగా బాలా మంత్రాన్ని ఉపదేశిస్తారు. మహా త్రిపురసుందరీదేవి నిత్యం కొలువైన పవిత్రమైన శ్రీచక్రంలో మొదటి ఆమ్నాయంలో ఉండే మొదటి దేవత శ్రీబాలాత్రిపుర సుందరీదేవి. అందుకే ముందుగా బాలాదేవి అనుగ్రహం పొందితేనే మహాత్రిపుర సుందరీదేవి అనుగ్రహాన్ని పొందగలము. దసరా మహోత్సవాల్లో భక్తులకు పూర్ణఫలం అందించే అలంకారం శ్రీబాలా త్రిపురసుందరీదేవి.

రైల్వేస్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుదాం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : స్వచ్ఛత అంటే కేవలం పరిసరాల పరిశుభ్రత మాత్రమే కాదు కాలుష్యం లేకుండా కుడా చేయలనే లక్ష్యంతోనే రైల్వేస్టేషన్ ఇతర ప్రాంతాలను అంతే పరిశుభ్రంగా ఉంచుకొవాలని డిఆర్‌ఎం నరేంద్ర ఎ. పాటిల్ పిలుపు నిచ్చారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భం ప్రధాని మోదీ స్వచ్ఛతా- హి-సేవా ప్రచారంలో ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం విజయవాడ డివిజన్ వ్యాప్తంగామెగా భారీ క్లీన్లీనెస్ డ్రైవ్ చేపట్టారు. స్టేషన్ తూర్పు ప్రధాన ద్వారంలోని క్లాక్ టవర్ వద్ద ఉన్న మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డిఆర్‌ఎం మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన స్వచ్ఛత యొక్క క్లారియన్ కాల్ మరియు క్లీన్ & గ్రీన్ ఇండియా కోసం కృషి చేయడానికి మిలియన్ల మంది పౌరులను ప్రేరేపించడం అభినందనీయమన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి, మన పర్యావరణ లక్ష్యాలను జీవితంలోని అన్ని రంగాలలో పరిశుభ్రతను సాధించడానికి ఒక పరివర్తన చొరవగా 10 సంవత్సరాల క్రితం స్వచ్ఛత పఖ్వాడా ప్రారంభించారన్నారు. గత 15 రోజులుగా సుమారు 1000 సిటీయులను గుర్తించి, పరిశుభ్రతలో కనిపించే మెరుగుదలని తీసుకురావడానికి గొప్ప సంకల్పంతో వ్యవహరించారని స్పష్టం చేశారు.పట్టణాలు,గ్రామాలలో స్వచ్ఛ భారత్ మిషన్,స్వచ్ఛతను ప్రచారం చేయడానికి ప్రతి సంవత్సరం 100 గంటలు పరిశుభ్రతకు కేటాయించాలని ప్రజలకు,సిబ్బంది సూచించారు.ఈ కార్యక్రమంలో ఏడిఆర్‌ఎమ్‌లు పి.ఇ.ఎడ్విన్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)ఎడ్విన్, శ్రీనివాసరావు కొండ(ఆపరేషన్స్),సీనియర్ డిఈఎన్‌హెఎమ్ ఎం. కిషోర్, సిబ్బంది, పాల్గొన్నారు.

25లోపు వలంటీర్లకు జీతాలు ఇవ్వకపోతే దీక్షలు

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటరీ అసోసియేషన్ (ఏఐవైఎఫ్) అనుబంధ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాఈ వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో గాంధీ విగ్రహానికి వలంటీర్లు పూలమాలలు వేసి, వినతి పత్రాలు సమర్పించారు. అందులో భాగంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లంకా గోవింద రాజులు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు పాల్గొని ప్రసంగిస్తూ వచ్చే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో వలంటీర్లకు న్యాయం చేయకుంటే చలో సీఎం క్యాంప్ కార్యాలయం చేపడతామని హెచ్చరించారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల హామీల ప్రకారం 10,000 గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిడికి లోనై రాజీనామా చేసిన వలంటీర్లు కొనసాగించాలన్నారు. పది వేల రూపాయల గౌరవ వేతనం, ఇప్పటిక వరకు ఉన్నా వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని,గ్రామ వార్డు సచివాలయాల్లో వలంటరీల హాజరుని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వలంటీర్‌లను రాజకీయ పార్టీల ముసుగులో కాకుండా ఎవరు అధికారంలో ఉన్నా ప్రజలకు సేవ చేయడమే తమ వంతు బాధ్యతను నిర్వహిస్తున్నామే తప్ప ఇంకోటి కాదు అన్నారు. వలంటీర్లకు రాజకీయ రంగు పూయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు కంచర్ల భార్గవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లంకే సాయి, వలంటీర్లు పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడు పుల్లయ్య మృతి

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటకు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు సంకా పుల్లయ్య (88) మంగళవారం రాత్రి మరణించారు. ఆయన స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేయటంతోపాటు, ఇదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా కొంతకాలం, ప్రధానోపాధ్యాయునిగా మరికొంతకాలం పనిచేసి, ఇక్కడే పదవీవిరమణ పొందారు. పుల్లయ్య భార్య గతంలోనే మరణించగా, ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. మరణ సమాచారం తెలుసుకున్న పలువురు ప్రముఖులు, స్థానికులు ఆయన మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలు బుధవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రీ చిత్రపటాలకు పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖరబాబు మాట్లాడుతూ గాంధీజీ భారదేశ స్వాతంత్ర పోరాటంలో గొప్ప నాయకుడు, అహింస సూత్రం ఆధారంగా దేశానికి స్వాతంత్ర సాధించడంలో ముఖ్యమైన కృషి చేశారన్నారు. దాంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 2న ఆయన జయంతిని గాంధీ జయంతిగా జరుపుకుంటాన్నామన్నారు. అలాగే లాల్ బహదూర్ శాస్త్రి గారు భారతదేశ రెండవ ప్రధానిగా పనిచేసి దేశాన్ని ప్రగతి పథములో ముందుకు నడిపిన వీరిద్దరు చేసిన ఉద్యమాలు, సంస్కరణలు గుర్తు చేశారు. అలాంటి మహానుబావుల ఆలోచనలు, సంస్కరణలు మన అందరికీ ఆదర్శప్రాయమని వారి అడుగుజాడల్లో మనమందరం ముందుకు సాగాలని పోలీస్ కమీషనర్ .రాజశేఖరబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి దసరా శరన్నవ రాత్రులు ప్రారంభం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నందు స్వస్తి శ్రీ చాంద్రమానేన క్రోధి నామ సం॥ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి గురువారము ది.03-10-2024న ఉదయం గం. 08-40నికలకు శ్రీ దసరా శరన్నవరాత్రులు ప్రారంభం కలశస్థాపన. ది. 09-10-2024న బుధవారము మూల నక్షత్రం సరస్వతి పూజ ది.10-10-2024న గురువారము దుర్గాష్టమి మరియు ఉదయం గం॥ 10-30నికలకు చండీ హెూమం ది. 11-10-2024న శుక్రవారము మహార్ణవమి సాయంత్రం పూజానంతరం కుష్మాండ బలిప్రధానం. ఉద్వసన ది.12-10-2024న శనివారము విజయదశమి సాయంత్రం గం 06.00లకు దేవాలయ ప్రాంగణములో విజయదశమి శమిపూజ మరియు ఆయుధపూజ. ది.13-10-2024న ఆదివారం ఉదయం గం॥ 10-30 ని॥లకు నిమజ్జనోత్సవము. శ్రీ దేవి శరన్నవరాత్రుల మహెూత్సవ సందర్భముగా తొమ్మిది రోజులు చండీ సప్తశతి పారాయణాములు, విశేషంగా సూర్యనమస్కారములు, జపానుష్టానులు నిర్వహించడం జరుగుతుంది అన్ని డిప్యూటీ కమిషనర్ . మరియు ఆలయ కార్యనిర్వహణ అధికారి. బి. హెచ్. వి. ఎస్. ఎన్. కిశోర్ కుమార్. చైర్మన్. జంగాల. శ్రీనివాస్ తెలిపారు.

మా బిడ్డ మృతికి కారణమైన వారిని శిక్షించండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : తమ కూతురిని ప్రేమ పేరుతో వంచించి పెళ్లి చేసుకొని తర్వాత వేధించి ఆమె మృతికి కారణమైన నిందితులను శిక్షించి తమకు న్యాయం చేయాలని గుంటూరు జిల్లా నల్లపాడుకు చెందిన మృతురాలు జనని తల్లి శంకర లీల పెద్దమ్మ ఓంకారమ్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బుధవారం గాంధీనగర్ లోని ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిగ్రీ 3 సం.చదువుతున్న తమ కూతురును ప్రేమ పేరుతో బండారు ఆనంద్ అనే ఆటో డ్రైవర్ మోసం చేయడంతో అతనితో పాటు 2022 జూలై 4న ఆమె వెళ్లిపోయింది అన్నారు. న్యాయవాది సలీం మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయకపోగా వారిపైనే అక్రమ కేసు బనాయించడం దారుణం అన్నారు. ఏడాది నుంచి పోరాడుతున్న మృతురాలి కుటుంబానికి న్యాయం జరగలేదన్నారు.

రామచంద్రపురంలో గ్రామ సభ

విశాలాంధ్ర-ఏ కొండూరు : ఏ కొండూరు మండలం రామచంద్రపురం గ్రామం లో బుధవారం సచివాలయ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ ముచ్చు సీతయ్య అధ్యక్షత న గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపి మండల పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నార చంద్ర బాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు అనుసారం గ్రామాల్లో గ్రామ సభ లు నిర్వహించి గ్రామాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు గురుంచి చర్చించు కోవడం లాంటివి ఈ సభ ద్వారా జరగు తయని ఆయన అన్నారు. అదే విధముగా ప్రతి గ్రామానికీ శుద్ధ మైనా కృష్ణా జలాలను ప్రతి ఇంటికి అందించే విధంగా పైప్ లైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి అని ఆయన అన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్క రహదారి నీ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అలానే ఉపాధి హామీ పని దినాలు రొజు వారి వేతనాలు అంచనాలు గురుంచి ప్రజలను తెలియ చేశారు అనంతరం మహత్మ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానకి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేనా నాయకులు ముదిగొండ్ల సాయి కృష్ణా సచివాలయ కార్యదర్శి ఎం. నాగబాబు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

కాలుష్యరహిత సమాజం కోసం కృషి : మేయర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా నగర మేయర్ భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఈట్ స్ట్రీట్ వద్ద నిర్వహించిన సైకిల్ థాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛత అంటే కేవలం పరిసరాల పరిశుభ్రత మాత్రమే కాదని కాలుష్యం, కాలుష్య రహిత సమాజంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు సైకిల్ థన్ కార్యక్రమాలు నగరపాలక సంస్థ నిర్వహించటం ఎంతో గర్వకారణమన్నారు. నగర ప్రజలు కూడా కనీసం సెలవు దినాల్లోనయినా సైకిల్ తొక్కే అలవాటును అలవర్చుకుని తద్వారా కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా నగరాన్ని కాలుష్యరహిత నగరంగా మార్చని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని నిర్వహించిన సైకిల్ థన్ కార్యక్రమంలో కేవలం పరిసరాల పరిశుభ్రతం గురించి అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీ మాత్రమే కాకుండా సైకిల్ తొక్కడం వల్ల కాలుష్యరహిత సమాజం ఏర్పాటుకు తోడ్పాటునందించేందుకు వచ్చిన విద్యార్థులు, ప్రజలకు చైతన్యం కల్పించటమే కాకుండా వారి ద్వారా ఇతరులకు కూడా అవగాహన కల్పించేటట్టు స్వచ్ఛతపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని మేయర్ జెండా ఊపి సైకిల్థన్ ప్రారంభించారు. కమిషనర్, విద్యార్థులు, ప్రజలు, అధికారులు, సైకిల్ తొక్కి నిర్వహించిన సైకిల్ థాన్ ఈ స్ట్రీట్ నుండి ప్రారంభమై బందు రోడ్డు, బెంజ్‌సర్కిల్ మీదుగా తిరిగి ఈ స్ట్రీట్ వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, సీఎంవోహెచ్ డాక్టర్ పీ.రత్నావళి, డీసీపీ జుబిన్ చీరన్‌రాయ్, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనకంచిలో ఐసిడిఎస్ స్వచ్ఛతహిసేవ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : చిల్లకలు ఐసిడిఎస్, సిడిపిఓ, లక్ష్మీ భార్గవి ఆదేశాల మేరకు బుధవారం కొనకంచిలో గ్రామ ప్రత్యేకాధికారి కె.ఉషారాణి, సర్పంచ్ గోనెల దేవి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి మహాత్మా గాంధీ జయంతి, మరియు స్వచ్ఛత సాహి సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామ సభ మరియు అంగన్వాడీ కేంద్రాలలో సామాజిక వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ శైలజ వివిధ శాఖల అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నింవ్యవసర వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద గల రామాలయం లో మహాత్మాగాంధీ 155వ జయంతి, లాల్ బహదురు శాస్త్రి 120 వ జయంతి వేడుకలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దివ్యంగ వరద బాధితులకు సక్షం దివ్యా%శీ%గులకోసం పనిచేసే సంస్థ ఆధ్వర్యంలో 20 మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో సక్షం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ వి స్ మూర్తి, రాష్ట్ర సెక్రటరీ విజయ రామారావు, గుంటూరు జిల్లా ఆఫీసు ఇన్చార్జి వీరాంజనేయులు, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మారాసు కృష్ణమోహన్, సూరజ్,మున్సిపాలిటీ అధ్యక్షులు చల్లా ఆంజనేయులు,కరుకుమల్లి సత్యవతి,కృష్ణం రాజు,రాయపూడి వెంకటరావు,బుల్లిపాము, ఉండి నాగేశ్వరావు, కార్యకర్తలు, నాయకులు అభిమానులు పాల్గొన్నారు

'మెస్సీయ ఫెలోషిప్' ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : మెస్సీయ ఫెలోషిప్" ఆధ్వర్యంలో ద్వైవజనులు డాక్టర్ సజ్జా రత్నకుమార్ నిర్వహణలో ఉచిత వైద్య శిబిరం విజయవాడ స్థానిక ఆటోనగర్ గేట్ వద్ద100 అడుగుల రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వైవజనులు సజ్జ రత్నకుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని మధ్యాహ్నానికి 1500 మంది పేషెంట్లు వారి వారి వ్యాధులను, నిపుణులైన డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించుకున్నారని, వ్యాధులను బట్టి ఉచిత టెస్టులు, డాక్టర్ సలహాలు. చేయించుకుని మందులు ఉచితంగా తీసుకుని వెళ్లారని ద్వైవజనులు సజ్జా రత్నకుమార్ తెలియజేశారు. రమేష్ హాస్పిటల్, కామినేని హాస్పిటల్, అంకుర హాస్పిటల్ సహకారంతో మెగా క్యాంపు నిర్వహించామని ప్రతి సంవత్సరం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలని ఆ యేసయ్య మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నారని, అదంతా ద్వైవము చేస్తున్న పనిగానే మేము భావిస్తున్నామని ఆయన అన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉచిత కంటి పరీక్షలు, బీపి, షుగర్, ఈ.సి.జీ, థైరాయిడ్, బిఎండి, ఆర్‌బిఎస్, ఆడియో మెట్రిక్, 2డి ఎకో తదితర పరీక్షలు, గుండె, ఊపిరితిత్తులు, దంత, కీళ్ళవ్యాధులు, గైనకాలజీ, న్యూరాలజీ, చెవి, ముక్కు, గొంతు ఇతర వ్యాధులను పరీక్షించి అవసరమైన సలహాలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు . ఈ కార్యక్రమంలో మెస్సీయ ఫెలోషిప్ నిర్వాహకులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

4 నుంచి ఉచిత చెస్ కోచింగ్ క్యాంప్

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్: గ్లోబల్ చేసే అకాడమీ ఆధ్వర్యంలో ఈ నాలుగో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు ఉచిత దసరా చెస్ శిబిరాన్ని నిర్వహిస్తోందని గ్లోబల్ చేసే అకాడమీ ప్రధాన కార్యదర్శి ఎస్కే కాశీం తెలిపారు. ఈ ఉచిత శిబిరాన్ని పడమట లోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తారని తెలిపారు. 7 నుంచి 15 సంవత్సరాల వయోపరిమితిలో ఒక బ్యాచ్ కి 50 మందికి శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 8 గంటల నుండి 10 గంటల 30 నిమిషాల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం ఎస్కే కాసిం (అంతర్జాతీయ చెస్ కోచ్, 9849514138) సంప్రదించాలన్నారు.

గోపయ్యస్వామి తలపాగాకు రూ.20 వేల విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో నీ గోపయ్య స్వామి తల పాగాకు ఆంధ్రప్రదేశ్‌పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు రూరల్ శనివారం పేట వాస్తవ్యులు రాంభూపాల్ శ్రీ గోపయ్య స్వామివారి బంగారు తలపాగా తయారు నిమిత్తం రూ.15,020 విరాళంగా ఆలయ అధికారులకు బుధవారం అంద చేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు చే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రాణహాని ఉంది-రక్షణ కల్పించండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కులాంతర వివాహం చేసుకున్న తమకు తమ కుటుంబాల నుండి ప్రాణహాని ఉంది పోలీసులు తమకు రక్షణ కల్పించాలని ఒక ప్రేమజంట విజ్ఞప్తి చేసుకున్నారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో పల్నాడు జిల్లాలోని సిరిగిరిపాడుకు చెందిన చిలకల శ్రావణి మాట్లాడుతూ తమ ప్రాంతానికి చెందిన బత్తుల రామారావుతో గత మూడు సంవత్సరాల నుండి నాకు పరిచయం ఉందని అది ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని అనుకున్నాము. మా తల్లిదండ్రులు ఒప్పించటానికి చాలా ప్రయత్నం చేశాం. ఫలితం లేక సెప్టెంబర్ 10న రామారావు దగ్గరికి వచ్చి 11న ఇద్దరం ఇష్టపూర్వకంగా షిరిడీలో పెళ్లి చేసుకున్నామన్నారు. 15న పటమట పోలీస్‌స్టేషన్లో పోలీసులు తల్లిదండ్రులను పిలిచి మాట్లాడించారు. ప్రస్తుతం నా భర్త ఒక చిన్న ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని దాంతో తమకు ప్రాణభయం ఉందని దీనిపై నగర పోలీస్ కమిషనర్ కలవడానికి వెళ్తే అక్కడ కలిసే అవకాశం లభించలేదన్నారు. భర్తకి ప్రాణహాని ఉంది నా కుటుంబం నుండి రక్షణ కల్పించి పోలీసులు న్యాయం చేయాలని కోరుతున్నాం అని వేడుకున్నారు.

ఉపాధి గ్రామసభలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అధికారులు నరేగా పథకం గ్రామసభలను నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన ఈ సభలను నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళులర్పించి, అనంతరం గ్రామాల్లో పథకం ద్వారా చేయవలసిన పలు పనులను గుర్తించి, తీర్మానించారు. పలు గ్రామాలకు చెందిన ప్రముఖులు, స్థానికులు ఈ సభల్లో పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ 129వ జయంతి

విశాలాంధ్ర-మైలవరం : భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దొరలు, దోపిడీ దొరలు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించిన చాకలి ఐలమ్మ 129 జయంతి కార్యక్రమము గురువారం మధ్యాహ్నం మైలవరంలో రెండు ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. చిట్యాల ఐలమ్మ 1885 సెప్టెంబర్ 26వ తేదీన జన్మించి, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో దోపిడీ వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి , నేడు తెలంగాణ ప్రభుత్వం ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే నిర్వహిస్తూ, కోటి మహిళా యూనివర్సిటీ కి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా నామకరణ చేయటం గర్వకారణం అని ప్రసంగించారు. మైలవరంలోని పంచాయతీ గెస్ట్ హౌస్ వద్ద, నూజివీడు రోడ్ లోని ఆటో స్టాండ్ వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూజివీడు రోడ్ లోని ఆటో స్టాండ్ వద్ద ఐలమ్మ 129 వ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి ఆటో కార్మికులకు, పాదచారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బుద్ధవరపు వెంకటరావు, మైలవరం నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షులు తాళ్లూరి శేషగిరిరావు, మైలవరం రజక సంఘం అధ్యక్షులు మల్లెల రాధాకృష్ణ ,ఆరో వార్డు పంచాయతీ సభ్యులు మల్లెల దుర్గారావుటీ రాచూరి కృష్ణ, మోదుగ పరపు నాగేశ్వరరావు ,డి. వీరభద్రరావు, బిజెపి నాయకులు జుజ్జవరపు సరేంద్ర, నియోజకవర్గం రజక సంఘం నాయకులు బుద్ధవరపు గోపాల్ రావు, చంద్రగూడెం రజక సంఘం ఉపాధ్యక్షులు మల్లారపు శ్రీనివాసరావు , సూరాయి పాలెం గ్రామ రజక నాయకులు జూపల్లి నాగబాబు, గణపవరపు సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీదేవాలయంలో గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్), విజయవాడ ఎస్ఎస్ కళాశాల ప్రాంగణంలో ఉన్న గాంధీ దేవాలయంలో గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తొలుత మహాత్మా గాంధీ పేరిట హెూమం నిర్వహించి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమం చేసిన ఉప్పులూరి లక్ష్మీనారాయణ శర్మ, మహాత్మా గాంధీ దేవాలయం ఫౌండర్ చైర్మన్ రాంపిళ్ల జయప్రకాశ్ ఆధ్వర్యంలో లో వేడుకలు జరిగాయి.ఈ సందర్భముగా ఉప్పులూరి లక్ష్మీనారాయణ శర్మ మహాత్మా గాంధీ శత నామావళి..పూజా విధానం పుస్తకాన్ని ఆవిష్కరించారు.మహాత్మా గాంధీ అడుగు జాడల లో నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం అతిథులకు వేద ఆశీర్వాదం అందచేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటి అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మదేశం వసంత్ కుమార్, కార్యదర్శి కొండాయ గుంట రాము.కోశాధికారి గుర్రం ఏడుకొండలు, పి.రాజారావు, పి.విశ్వేసరయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు తహశీల్దార్‌గా షేక్ హుస్సేన్

విశాలాంధ్ర-వీరులపాడు: మండల తహశీల్దార్ గా కె.రాజకిషోర్ స్థానంలో షేక్ హుస్సేన్ బుధవారం జుజ్జూరు గ్రామంలోని తన కార్యాలయంలో విధులు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా ఆయన పశ్చిమ గోదావరి జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ వీరులపాడు మండలానికి బదిలీ పై వచ్చారు.

గ్రామసభ రసాభాస

విశాలాంధ్ర-వీరులపాడు: 2023-24 ఆర్థిక సంవత్సరం లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పలు పనులపై దొడ్డదేవరపాడు లో బుధవారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా ముగిసింది. పలు పనులకు ఖర్చు చేసినట్లు చెప్తున్న నిధులకు ఎటువంటి రికార్డులు లేకపోవడం, పనులు కూడా నిర్వహించకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

మహాత్ముడి ఆదర్శంగా తీసుకోవాలి : మున్నా

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: మహాత్మా గాంధీ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని జైన్ హై స్కూల్ డైరెక్టర్ డాక్టర్ మొహమ్మద్ మున్నా అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు స్థానిక జైన్ హైస్కూల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కనకదుర్గ, ఉపాధ్యాయ సిబ్బంది దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మున్నా మాట్లాడుతూ అహింసను ఆయుధంగా చేసుకుని బ్రిటిష్ వారిని ఎదిరించి భారతదేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చిన మహా వ్యక్తి మహాత్మా గాంధీ అని, ఆయన కన్న కలలను సాకారం చేయాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జైన్ హై స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది అనూష, శ్రీదేవి, అఖిల, గాయత్రి , షబీనా, ఇంకా విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక ఎన్జీవోస్ కాలనీలో సుమేధ హైస్కూల్లో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయ బృందం పాల్గొని వారి యొక్క గొప్పతనాన్ని వారి సేవలను స్మరించి నివాళులు అర్పించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు మంగళగిరి విద్యార్థి

విశాలాంధ్ర-మంగళగిరి: రాష్ట్రస్థాయి పోటీలకు మంగళగిరి విద్యార్థి మంగళవారం తెనాలి ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 68వ స్కూల్స్ తైక్వాండో జిల్లా పోటీలలో మంగళగిరి పార్కు రోడ్‌లో శ్రీచైతన్య హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న ఎం. జ్ఞాన తేజస్విని బంగారు పతకం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినది. బంగారు పతకం సాధించిన విద్యార్థినిని తైక్వాండా కోచ్ దుర్గాప్రసాద్, స్కూల్ మేనేజ్మెంట్ శైలజ, విద్యార్థిని అభినందించారు. ఈ నెల 6, 7, 8 వ తేదీలలో రాష్ట్రస్థాయి పోటీలు తిరుపతిలో జరగనున్నాయి.

స్వచ్ఛతా హి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : దేశానికి స్వాతంత్ర్యం కంటే పారిశుధ్యమే ముఖ్యమని ప్రకటించిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను ప్రధాని నరేంద్రమోదీ స్వచ్ఛ భారత్ ద్వారా ఆచరణలో పెట్టారని, దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గుంటూరు సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. స్వచ్ఛత హి సేవ పక్షోత్సవంలో భాగంగా గుంటూరు సీజీఎస్టి కమిషనరేట్ పరిధిలో గాంధీ జయంతి పురస్కరిం చుకొని జీఎస్టీ, కస్టమ్స్, పాస్ పోర్ట్ ఉద్యోగులు బుధవారం వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమం జాతికి కొత్త నడవడిని నేర్పుతుందన్నారు. స్వచ్ఛత ఉద్దేశాన్ని ప్రజలందరూ గ్రహించాలి, ఆచరించాలి అన్నారు. ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష మాట్లాడుతూ..స్వచ్ఛ భారత్ ద్వారా మహాత్మ గాంధీ స్ఫూర్తి పునరుద్ధరణ జరిగిందన్నారు. తొలుత గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వాకథాన్‌లో జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.లక్ష్మినారాయణ, సహాయ కమిషనర్లు బి.రవికుమార్, వివిఎస్‌కె రాయలు, సీతారామరాజు సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్ర ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో మారుతి ఫౌండేషన్ చైర్మన్ జంగాల సాంబశివరావు, వైస్ చైర్మన్ జంగాల వెంకటేష్ ఆర్థిక సహకారంతో స్వచ్ఛతా హి సేవ-2024 కార్యక్రమంలో భాగంగా ఏంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలోని పారిశుధ్య కార్మికులకు ఉచితంగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో మారుతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు సిగిరిశెట్టి రాజా రమేష్, లింగంశెట్టి కిషోర్ కుమార్, దొప్పలపూడి జ్యోతి బస్, రాయపూడి కిరణ్, లాం నరేష్, కూనపరెడ్డి రమేష్, సోమారావు, సింగంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భావి తరాలకు ప్రాణ వాయువును అందిద్దాం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భావితరాల వారికి స్వచ్ఛమైన ప్రాణ వాయువును అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విద్య ప్రదాత, శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ విద్యా సంస్థల వ్యవస్థాపకురాలు మంగాదేవి పిలుపునిచ్చారు. ప్రకృతిని నాశనం చేస్తున్నామని, అది మనల్ని క్షమించదని, దానిని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి నేతృత్వంలోని ఎవర్ గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, ఉన్నతి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శ్యామల నగర్ ఎక్స్‌టెన్షన్‌లో 400 పైగా మొక్కలు నాటారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ తారకనాథ్, డాక్టర్ అమర్నాథ్, డాక్టర్ వివి రామ కుమార్, డాక్టర్ బాలినేని సాయికృష్ణ, ఉడుముల శ్రీనివాసరెడ్డి, బీఎంఆర్ గ్రూప్ చైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, డాక్టర్ దీప్తిరెడ్డి, ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని ప్రతిఘటించటమే మహాత్మునికిచ్చే నిజమైన నివాళి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎవరు, ఏ రూపంలో మతోన్మాదాన్ని పెంచి పోషించినా ప్రతిఘటిం చటమే ఆ మహాత్ముడికి మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందని వివిధ రంగాల ప్రముఖులు పేర్కొన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశాలాంధ్ర మాజీ జనరల్ మేనేజర్ గూడవల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత సామాజిక పరిస్థితులకు గాంధీజీ చూపించిన మార్గం, బోధించిన విలువలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం అధ్యక్షులు ఎస్.హనుమంతరెడ్డి మాట్లాడుతూ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా గాంధీ చేసిన ఉద్యమాలను ప్రతి ఒక్కరూ గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వి.సురేష్, ఆర్వీ సింగరయ్య, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు... ఆంధ్రుల సొత్తు

- ప్రైవేటీకరణ కుట్రలు ఆపాలి
- లేకుంటే మూల్యం చెల్లించక తప్పదు
- కార్మిక సంఘాల హెచ్చరిక
- పాలకులు ద్వంద వైఖరి విడనాడాలి
- సత్యాగ్రహ దీక్షలో జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విశాఖ ఉక్కు.. ఆంధ్రుల సొత్తు అని కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్రానికి తలమానికమైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే కుట్రలు ఇక ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నేటి ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ కార్యాలయం వద్ద రెండో రోజు బుధవారం సత్యాగ్రహ దీక్షలను కొనసాగించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్, సీఐటీయూ నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకులు కూరపాటి కోటయ్యల అధ్యక్షతన జరిగిన దీక్షలను ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు జంగాల అజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు జంగాల అజయ్‌కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీలు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. 32 మంది విద్యార్థి, యువజనుల ప్రాణత్యాగాలు, 72 మంది వామపక్ష ఎమ్మెల్యే, ఎంపీల పదవీ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును నరేంద్ర మోదీ కార్పొరేటీకరణ విధానాల ద్వారా కుట్రపూరితంగా ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని విమర్శించారు. పరిశ్రమను నేరుగా ప్రైవేటీకరించే అవకాశం లేకపోవడంతో ఖనిజాలు కేటాయించకుండా, బొగ్గు సరఫరా చేయకుండా, ఫర్నేస్‌లో ఉత్పత్తి తగ్గించి, పర్మినెంట్ ఉద్యోగులను డిప్యుటేషన్‌పై ఇతర పరిశ్రమలకు పంపడం, కాంట్రాక్ట్ కార్మికులను నిలుపుదల చేయడం వంటి చర్యలతో పరిశ్రమను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ నిర్వీర్యానికి పూనుకుంటున్నారని మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నష్టాలకు కారణం కేంద్ర ప్రభుత్వ విధానాలేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇంత జరుగుతుంటే లడ్డూ గురించే చర్చ చేస్తున్నారే తప్పా రాష్ట్ర సంపదగా భావించే విశాఖ ఉక్కు పరిరక్షణకు పూనుకుంటామనే వైఖరి నేటి ప్రభుత్వం నుంచి లేకపోవడం శోచనీయమని అన్నారు. పాలకులు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ద్వంద వైఖరిని విడనాడి ఉక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గత ఫలితాలే రాబోయే రోజులలో పునరావృతం అవుతాయని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, జిల్లా నాయకులు దేవరకొండ శ్రీనివాస్, నగర కార్యదర్శి చెవుల పున్నయ్య విప్లవగేయాలు ఆలపించారు. ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, నాయకులు మంగా శ్రీనివాస్, కూరాకుల రాంప్రసాద్, బందెల రవికుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, నాయకులు ముత్యాలరావు, మస్తాన్‌వలి, బాషా, నికల్సన్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ, సివిల్ సప్లయిస్ నాయకులు కిరణ్, డేవిడ్ తదితరులు దీక్షలో కూర్చున్నారు. నల్లమడ రైతు సంఘం కన్వీనర్ కొల్లా రాజమోహన్, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు మూర్తి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నాగరాజు, జనరల్ ఇన్సూరెన్స్ జిల్లా కార్యదర్శి రవికుమార్, రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాజు, మెడికల్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్ నాయకులు సలీం తదితరులు దీక్షలకు సంఘీభావం తెలియజేశారు. అదేవిధంగా ఆటో వర్కర్స్ యూనియన్ జీజీహెచ్ స్టాండ్ నాయకులు దీక్షా శిబిరానికి విచ్చేసి నాయకులకు పూలదండలు వేసి సంఘీభావం తెలియజేశారు.

పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం : మంత్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పరిశుభ్రత పాటించటం వలన ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది వేయవచ్చని, స్వాతంత్ర్యం కంటే స్వచ్ఛతకే మహాత్మ గాంధీజీ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన స్వచ్ఛత హీ సేవా ముంగిపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. సభలో జ్యోతి వెలిగించి మహాత్మ గాంధీజీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర మంత్రి ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశుధ్య కార్మికులు, ప్రజలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యం, సమానత్వం, అహింస కోసం గాంధీజీ నిరంతరం కృషి చేశారన్నారు. పరిసరాల పరిశుభ్రతలో కీలక భూమిక పోషించే పారిశుధ్య కార్మికుల ఆత్మాభిమానం పెంపొందించేలా వారికి అవసరమైన అన్ని సంక్షేమ కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేయటం జరుగుతుందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులలో సైతం పారిశుధ్య కార్మికులు ఎనలేని సేవలు అందించారన్నారు. పరిశుభ్రత అనేది నిరంతర కార్యక్రమమని ప్రతిఒక్కరూ వారి పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసుకొని పారిశుధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం చేసే కార్యక్రమంలో భాగస్వాములై సహకరించటం వలనే స్వచ్ఛ గుంటూరు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ భారతదేశం సాధ్యం అవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ మహాత్మ గాంధీ నుంచి స్ఫూర్తి పొందే అంశాలలో స్వచ్ఛత ప్రధానమైనదని అన్నారు. పారిశుధ్య కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర పోషించే పారిశుధ్య కార్మికుల సంక్షేమం, ఆరోగ్యానికి సంబంధించి అనేక కార్యక్రమాలను నిర్వహించటం జరిగిందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ స్వచ్ఛ గుంటూరు సాధనకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కృషి చేస్తామన్నారు. 2013లో గుంటూరులో పారిశుధ్య విభాగంలో ప్రారంభించిన రెండు రకాల చెత్త డబ్బాలు, పుష్ కాట్స్ నేడు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలు ఎండీ నసీర్ అహ్మద్, గల్లా మాధవి ఐటీసీ వైస్ ప్రెసిడెంట్(హెచ్ఆర్) వీరా స్వామి ప్రసంగించారు. పలువురు పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ పీఎఫ్ అకౌంట్లలో చిన్న చిన్న తప్పుల వలన సకాలంలో రుణాలు మంజూరు కావటం లేదని, పిల్లల చదువుకు, ఉపాధికి సహకారం అందించాలని, కుటుంబంలో జరిగే కార్యక్రమాలకు తొలుత స్వచ్ఛత హి సేవ కార్యక్రమంపై నగరపాలక సంస్థ, జిల్లా యంత్రాంగం కలిసి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్ శ్రీనివాసు, డి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సీపీ రాంబాబు, ఎస్ఈ శ్యాం సుందర్, ఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని లుంబిని వనంలోని మహాత్మాగాంధి విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ పోవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజాలతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ దాస్య శృంఖలాలను త్రెంచి దేశ స్వాతంత్ర్య సముపార్జనకు కృషి చేసిన మహనీయుడు మహాత్మాగాంధి అన్నారు. సత్యం, అహింస, ఆయుధాలుగా చేసుకొని స్వాతంత్ర్య ఉద్య మంలో అలుపెరగని పోరాటం చేసిన గొప్ప మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధి అన్నారు. ఆయన వ్యక్తిగత, పరిసరాల పారిశుద్యానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పారిశుధ్యం అనేది నిరంతర ప్రక్రియ అని ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములై జిల్లాను స్వచ్ఛ జిల్లాగా రూపాంతరం జరిగే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్ర రావు, పలు సెక్షన్‌ల పర్యవేక్షకులు ఇస్మాయిల్, మల్లేశ్వరి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీలో:

మహనీయుడు మహాత్మాగాంధీ చూపిన మార్గంలో విద్యార్థులందరూ పయనించాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పిలుపునిచ్చారు. విజ్ఞాన్ యూని వర్సిటీ, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో దేశ జాతిపిత మహాత్మా గాంధీ 155వ జయంతి, స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ ప్రధాని భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గాంధీ జయంతిని పురస్కరిం చుకుని నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజే సారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జె.మోహన్ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో:

జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా ఆదేశాలతో బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గుంటూరు జిన్నాటవర్ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. డీసీసీ అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, జాన్ బాబు, సుభాని, సందీప్, బన్నీ, మహమూద్, జబి, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో:

జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో ఉన్న గాంధీ విగ్రహానికి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ ఆదర్శాలు, విలువలను ప్రతిఒక్కరూ అనుసరించా లన్నారు. బాపూజీ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పట్టుదలగా నిలబడి, ఆచరించి, భారతదేశం స్వాతంత్ర్యం సాధించుటలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాస్ రావు, ఆర్ఐ బ్రహ్మానందం, ఇతర ముఖ్య అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరోసారి పోలీస్ విచారణకు హాజరైన జోగి

విశాలాంధ్ర-మంగళగిరి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంపై దాడికి సంబంధించిన ప్రథమ ముద్దాయిగా ఉన్న వైసీపీ మాజీ మంత్రి జోగి రమేష్‌ను నోటీసులు ఇచ్చి విచారణకు పిలిపిం చినట్లు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. కరకట్టలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంపై వైసీపీ ప్రభుత్వ హయాంలో దాడి విషయమై వైసీపీ మాజీ మంత్రి జోగి రమేష్ మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌కు బుధవారం విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం డీఎస్పీ మురళీకృష్ణ మీడియాతో మాట్లాడుతూ విచారణలో అడిగినా సమాధానాలకు మాజీ మంత్రి జోగి రమేష్ సరైన సమాధానం చెప్పలేదని అన్నారు. ఇప్పటివరకు విచారణలో తేలిన అంశాలను బట్టి అలాగే సాక్షులు చెప్పిన సాక్ష్యాన్ని బట్టి ఈ కేసులో ఇతర ముద్దాయిలు చెప్పిన సాక్ష్యాన్ని బట్టి ప్రథమ ముద్దాయి జోగి రమేష్ చెప్పిన సాక్ష్యాలను చూస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని వెల్లడించారు. కొన్నింటికి సమాధానం చెప్పి, మరికొన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేదని మీడియాకు డీఎస్పీ వివరించారు. ప్రస్తుత విచారణలో జోగి రమేష్ సరైన సమాధానాలు చెప్పలేదని అవసరమైతే మళ్లీ నోటీసులు ఇచ్చి పిలిపిస్తామని చెప్పినట్లు డీఎస్పీ తెలియజేశారు. ఇప్పటివరకు ఈ కేసులో మొత్తం ఎనిమిది ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పేదలకు బియ్యం, పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-తెనాలి : ఏఐఎస్ఎఫ్ తెనాలి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్ సైడ్ నివసిస్తున్న పేద ప్రజలకు బియ్యం, విద్యార్థులకు పుస్తక పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారంతోపాటు సమాజంలో ఉన్న పేదవారికి బియ్యం పంపిణీ కార్యక్రమం చేయడం ఆనందకరమని అన్నారు. కొందరు దాతల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో కొనసాగిస్తామని తెలియజేశారు. ప్రభుత్వం ఇటువంటి వారి మీద ప్రత్యేక శ్రద్ధ వహించి వారి జీవన విధానం ముందుకు సాగే విధంగా ఆదుకోవా లని కోరారు. కార్యక్రమం ఏర్పాటు చేసిన తెనాలి పట్టణ కమిటీని అభి నందించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎన్నో వీరోచిత పోరాటాలు చేసిందని, విద్యారంగంలో సమస్యల ప్రక్షాళన కోసం ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవి ష్యత్తులో మరెన్నో చేసి ప్రజా సమస్యలు, విద్యారంగ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ముందుండి పోరాటాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ తెనాలి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గండు శివ, చెన్నూరి తిరుమల సాయి, కోశాధికారి పవన్, పండు మస్తాన్, గోరంట్ల కళ్యాణ్, అఖిల్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-పెదకాకాని: గుంటూరు జిల్లాలో అత్యంత ప్రసిద్ధి చెంది శైవ క్షేత్రముగా విరాజిల్లుచున్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం నందు ప్రారంభము య్యే దేవీ శరన్నవరాత్ర మహో త్సవము లకు భక్తులకు ఎటు వంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. దేవాల యము అంతయూ ప్రత్యేక విద్యుత్‌దీపాలంకరణ, ఆలయ ప్రాంగణమలో ప్రత్యేక పూల అలంకరణ చేస్తున్నారు. దసరా ఉత్సవాలలో తొమ్మిది రోజులు చండీ హెూమములు నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ నెల 9న మూల నక్షత్రము సందర్భముగా శ్రీ భ్రమరాంబ అమ్మవారు సర స్వతీ దేవి అలంకారములో భక్తు లను అనుగ్రహించెదరని తెలిపారు.

మత సామరస్యమే మహాత్మా గాంధీజీ సందేశం : డొక్కా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మత సామరస్యమే జాతిపిత మహాత్మా గాంధీ జీవిత సందేశమని మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా లాలాపేట లోని మహాత్మా గాంధీ విగ్రహానికి డొక్కా మాణిక్యవర ప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కన్న విద్యా సంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు, కాపు నాయకులు మాదారాధా, దాసరి జాన్‌బాబు, రాజపుత్ర సత్యం సింగ్, మాజీ కార్పొరేటర్ మందాడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినాల్లో తరగతులు అడ్డుకుంటాం: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-తెనాలి : గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించినప్పటికీ తెనాలిలో కొన్ని కాలేజీలు, స్కూల్లు యధావిధిగా తరగతులు నిర్వహిస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు వెళ్లి తరగతులను అడ్డుకున్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలకు ఎన్నిసార్లు చెప్పినా లెక్క చేయట్లేదని, అధికారులు చెప్పటం సిగ్గుచేటని నాయకులు అన్నారు. విద్యార్థులను ర్యాంకుల పేరుతో మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఇలాంటి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో తెనాలిలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పాశం వెంకటేష్, తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దినేని కిరణ్ బాబు, అధ్యక్ష, కార్యదర్శులు గండు శివ, చెన్నూరి తిరుమల సాయి, కోశాధికారి పవన్, పండు, తేజ, గోరంట్ల కళ్యాణ్, మస్తాన్, పవన్, అన్నం తేజ, అఖిల్, శేఖర్ పాల్గొన్నారు.

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గ్రామాలు, పట్టణాలు, నగరా ల్లో ప్రజలకు సేవలు అందిం చడంలో కీలక భూమిక పోషిస్తున్న గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ఈ దసరా పండుగ కానుకగా ఐఆర్ ప్రకటించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీఆర్ఆర్ కిషోర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. అదేవిధంగా 12వ పీఆర్సీని నూతన సంవత్సర కానుకగా ఉద్యోగులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ వార్డు సచివాలయాలు ఏర్పడి నేటికి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయని, గాంధీజీ కన్న కలలను సాకారం చేస్తూ గ్రామ వార్డు సచివాలయాలు అనేక సేవలను అందించి ప్రజల మన్ననలు పొందిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ దసరా పండుగకు ఐఆర్ ప్రకటించి ఉద్యోగులకు మేలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

విలువలతో కూడిన విద్య అవసరం: ఎస్పీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేటి విద్యా విధానంలో విలువలతో కూడిన బోధన అవసరమని ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కెజీవి సరిత అన్నారు. గుంటూరులోని భాష్యం విద్యా సంస్థల ఆడిటోరియంలో జరిగిన మానవత ఆవిర్భావ దినోత్సవ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. కెజీవి సరిత మాట్లాడుతూ విద్యార్థులలో మానవత విలువలు, పోటీతత్వం, సానుకూల దృక్పథాలను చిన్న వయసు నుండే నేర్పాలని కోరారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గత రెండు సంవత్సరాలుగా గుంటూరులో మానవత్వాన్ని నింపే బహుముఖ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నేర పరిశోధన విభాగ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి రోజున మానవత ఆవిర్భావ దినోత్సవ సభ జరుపుకోవడం హర్షనీయమన్నారు. బొమ్మిదాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ రూ.60 వేలు విలువ చేసే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ మెటీరియల్‌తో కూడిన 200 పుస్తకాలను గుంటూరు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు అందివ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ పావులూరి రమేష్, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కె.సతీష్, వి.నాగేశ్వరరావు, టీ.వి.సాయిరాం, ధనుంజయ రెడ్డి, చావా శివాజీ, ఉప్పల సాంబశివరావు, ఎన్.సాంబశివరావు, వి.సుబ్రహ్మణ్యం

జాతిపితకు ఘన నివాళి

విశాలాంధ్ర-గురజాల: జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలు బుధవారం వాడవాడల ఘనంగా జరిగాయి. గాంధీజీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ చిత్రపటాలకు పూలతో ఘన నివాళులర్పించారు. గురజాల రెవెన్యూ డివిజన్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్లలో రిగిన గాంధీజీ జయంతి వేడుకలలో తహసీల్దార్ నగేష్, ఆర్డీవో కార్యాలయం సిబ్బంది, సీఐ భాస్కర్, ఎస్సై వినోద్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గురజాలలో మెయిన్ బజార్లో గల కమ్యూనిటీ అరుగుపై ఏర్పాటు చేసిన గాంధీజీ కాంస్య విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం, పెద్ద ఎత్తున పాల్గొని పూలదండలతో ఘన నివాళులు అర్పించారు. మండలంలోని గంగవరం గ్రామంలో టిడిపి, జనసేన కూటమి శ్రేణులు గ్రామ సచివాలయంలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు.

జాతిపితకు ఎమ్మెల్యే నివాళి

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: స్థానిక టీడీపీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి గురజాల శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ళ పట్టణంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన రాష్ట్ర, పార్లమెంటు, నియోజకవర్గ, మండల, వార్డు స్థాయిల్లోని వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

రేషన్ షాపులు తనిఖీలు

విశాలాంధ్ర-గురజాల: మండలంలోని అనేక గ్రామాల్లో బుధవారం తహసీల్దార్ నగేష్ ఆధ్వర్యంలో రేషన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని కొత్త అంబాపురం గ్రామంలోని రేషన్ షాపులో తహసీల్దార్ నగేష్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి రేషన్ సరఫరాలో ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా ప్రజలకు రేషన్ అందించాలని ఈ సందర్భంగా రేషన్ డీలర్లకు సూచించారు.

పంచాయితీ నిధులు దుర్వినియోగం అవాస్తవం : కార్యదర్శి

విశాలాంధ్ర-దాచేపల్లి: మండలంలోని కొత్తూరు పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్లు సర్పంచి చేసిన ఆరోపణల్లో నిజం లేదని కార్యదర్శి రామకోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సర్పంచి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన బ్యాంకు ఖాతా నుంచి డ్రా చేసిన ప్రతి రూపాయికి అధారాలతో సహా లెక్కలు ఉన్నాయన్నారు. పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులకు చెల్లించిన బిల్లులు ఉన్నాయన్నారు. స్వీపర్లతో సహా కంప్యూటర్ ఆపరేటర్లకు నెల వారీ జీతాలు చెల్లించినట్లు తెలిపారు. విద్యుత్ బకాయిలకు సంబంధించిన బిల్లులు కట్టినట్లు చెప్పారు. బ్యాంకు నుంచి నిధులు డ్రా చేసి వీటన్నింటికీ ఖర్చు చేసినట్లు వివరించారు. కావున నిధుల దుర్వినియోగం మాట అవాస్తవమని, సర్పంచి చేసిన ఆరోపణల్లో నిజం లేదని కార్యదర్శి కొట్టిపారేశారు.

గాంధీ జయంతి వేడుక

విశాలాంధ్ర-నూజెండ్ల : మండలంలోని జంగాలపల్లి గ్రామ పంచాయతీలో గల ఎస్సీకాలనీలో గాంధీ జయంతి వేడుకలను పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో ఐటిసి-సెర్ప్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఎస్ఈ కన్సల్టెంట్ రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చా సైడ్ కాలువలలో చెత్తా చెదారం పిచ్చి మొక్కలను తొలగించి మెట్ట తామర మొక్కలను నాటించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, ఐటీసీ ప్రతినిధులు ఏసోబు, సతీష్, క్లాప్ మిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాత్మునికి నివాళి

విశాలాంధ్ర-వినుకొండ: స్వాతంత్ర సమరయోధులు మరియు త్యాగమూర్తులు మోహన్ దాస్ కరంచంద్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా వినుకొండ నరసరావుపేట రోడ్డు పెట్రోల్ బంకు వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించిన రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ అధ్యక్షులు గుమ్మ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గాంధీ జీవితం ప్రపంచ పౌరులకు ఆదర్శప్రాయంగా ఉంటుందని అనగా గాంధీ మహాత్ముడు జీవితకాలం మద్యానికి దూరంగా ఉండటం స్మోకింగ్ దూరంగా ఉండటం మరియు శాఖాహార జీవితం ఆహార పద్ధతులు జీవితానికి సంపూర్ణత చేకూర్చాయని ఆయన యొక్క అహింస సిద్ధాంతం మరియు సత్యాన్ని అనుసరించుట మన భారతదేశం యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని రోటరీ క్లబ్ క్రియాశీలక సభ్యులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గుమ్మా శ్రీకాంత్ రెడ్డి కార్యదర్శి వై వి నారాయణ పూర్వ అధ్యక్షులు చిరుమామిళ్ల కోటేశ్వరరావు గుత్తా గురునాథం దావులూరి శ్రీనివాసరావు ఎస్ కే కరీముల్లా ఎల్ఐసి రామన్ బత్తుల శ్రీను సాదినేని శ్రీనివాసరావు పెనుగొండ రాజేష్ ఆంజనేయులు సిహెచ్ నాగరాజు ఎం రమేష్ వెంకటేశ్వర్ రెడ్డి ఎమ్మెస్ బాజీ తదితరులు నివాళులర్పించారు.

టీడీపీ నాయకులు చెంచయ్య మృతి

విశాలాంధ్ర-తాడికొండ : నియోజవర్గ కేంద్రమైన తాడికొండకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మద్దుల చెంచయ్య(64) బుధవారం మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. పార్టీ తొలినాళ్ల నుంచి తుది శ్వాస విడిచే వరకు తెలుగుదేశం పార్టీని అంటిపెట్టుకొని ఉన్నారు. చెంచయ్యకు భార్య ఇరువురు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు, దమ్మాటి సీతామహాలక్ష్మి, నూతక్కి నవీన్ కుమార్, కొలికపూడి బుల్లయ్య, జఫరుద్దీన్, ఎర్రమనేని వాసు, సీపీఐ నాయకులు రేపూడి శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు చింతల భాస్కరరావులు చెంచయ్య కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు.

నేటి యువతకు మహాత్మాగాంధీ జీవితం ఆదర్శం

విశాలాంధ్ర-వినుకొండ : నేటి యువతరం, భావితరాలకు జాతిపిత మహాత్మాగాంధీ జీవితమే ఒక సందేశం, ఆదర్శం అని తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అహింసా మార్గంలోనే పోరాడి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన ఆయన తన వ్యక్తిత్వం, పోరాట స్ఫూర్తితోనే ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమందికి, ఎన్నో దేశాల అధినేతలకు అభిమాన నాయకుడు, ఆరాధ్యుడిగా నిలిచారని కొనియాడారు. గాంధీ జయంతి సందర్భంగా వినుకొండ ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతిపిత విగ్రహానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ. మహాత్ముడికి భారత్‌తో పాటు ప్రపంచం మొత్తం ఆయనకు అభిమానులు ఉన్నారన్నారు. తనకు ఆదర్శం గాంధీజీ అని, ఆయన వల్లే ఈ స్థాయికి ఎదిగానని స్వయంగా అమెరికా అధ్యక్షుడు చెప్పడాన్నీ గుర్తు చేశారు. సత్యమేవ జయతే నినాదంతో ధర్మాన్ని ఆచరించమని, ప్రోత్సహించమని, అహింసా మార్గంలోనే విజయం సాధించగలమని గాంధీ సందేశమిచ్చారన్నారు. అందుకే చరిత్ర ఉన్నంతకాలం గాంధీని ప్రపంచం మరిచిపోదన్నారు. అవమానాలు, అంటరానితనానికి కుంగిపోకుండా చైతన్య స్ఫూర్తితో అసమానతలు పోవాలని, మానవులంతా ఒక్కటేనని కులాలు, మతాలకు అతీత సమాజం రావాలని మహాత్ముడు కోరుకున్నారన్నారు. అదేస్ఫూర్తితో తెల్లవారిపై పోరాటం చేసి తరిమికొట్టారన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి రాక్షస పాలనలో చంద్రబాబు కూడా ఎన్నో అవమానాలకు, ఇబ్బందులకు గురయ్యారని, జైలులో పెట్టినా ఆయన సతీమణి భువనేశ్వరిని అనరాని మాటలతో అవహేళన చేసి అవమానపరిచినా కుంగిపోకుండా, ధైర్యంగా పోరాడి రాక్షస పాలన తుదముట్టించారని తెలిపారు. గాంధీ ఆశయాలు, కార్యక్రమాలను సాధించాలని 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ విజయవంతంగా చేపట్టారన్నారు. గ్రామగ్రామాన మరుగుదొడ్లు, సిమెంట్ రహదారులు, సీసీ డ్రెన్లు నిర్మించి ప్రోత్సహించారని అన్నారు. ఎమ్మెల్యే జీవీ. సుమారు 24 లక్షల మరుగుదొడ్ల నిర్మాణంతో స్వచ్ఛాంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శంగా నిలిపారన్నారు. రూ.22 వేల కోట్లతో సీసీ రహదారులు వేసి దేశంలోనే ఆదర్శంగా నిలబడ్డారని కొనియాడారు. మహనుభావులు మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి ఒకేరోజు పుట్టడం గొప్ప విశేషమన్నారు. పదవి కంటే నైతిక విలువలు ముఖ్యమని చాటిచెప్పిన మహనుభావుడు లాల్‌బహదూర్ శాస్త్రి అని అన్నారు. భావితరాల కోసం మహాత్మాగాంధీ, బహదూర్‌శాస్త్రి ఆశయాలను సాధించడానికి ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పఠాన్ అయుబ్ ఖాన్, బిజెపి నాయకులు మేడా రమేష్, టిడిపి నాయకులు పివి సురేష్ బాబు ,పత్తి పూర్ణచంద్రరావు, సీనియర్ న్యాయవాదులు నలబోలు రామ కోటేశ్వరరావు, పొట్లూరు సైదారావు, రొడ్డ వీరాంజనేయరెడ్డి, గట్టుపల్లి శ్రీనివాసరావు, మోటమర్రి నరసింహారావు, సోమేపల్లి శ్రీనివాసరావు, చికెన్ బాబు,పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతిపితకు నివాళి

విశాలాంధ్ర-మాచర్ల: మహాత్మా గాంధీ జయంతిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఎం.ఆర్.ఓ జియా ఉల్ హక్ మాట్లాడుతూ ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస రావు, సీనియర్ అసిస్టెంట్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-దాచేపల్లి: ఊరు వాడా గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కుటుంబరావు , సీఐ వెంకట్రావు, ఎస్సై శివ నాగరాజు, ఎంపీపీ కందుల జాను, ఎంపీడీవో రామకృష్ణ, నగర పంచాయతీ చైర్ పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, కమిషనర్ అప్పారావు తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కొట్ల బజారులో ఆర్య వైశ్య సంఘీయులు కొత్తగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

విశాలాంధ్ర-రెంటచింతల: గాంధీజీ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రమైన రెండు చింతల లోని రామాలయం సెంటర్లో నిర్వహించిన వేడుకల్లో మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు ఏచూరి వెంకట సైదయ్యతో పాటు పలువురు పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వెంకట సైదయ్య దంపతులు రోగులకు ఉపయోగపడే దుప్పట్లు, దిండ్లు వితరణ చేశారు. కాంగ్రెస్ నేత కర్నాటి కోటయ్య, నారాయణపురం శ్రీనివాసరావు, యశోద పాల్గొన్నారు.

విశాలాంధ్ర-శావల్యాపురం: గాంధీజీ కలలుకన్న సమాజం నిర్మించ దానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్టీయూ మండల కార్యదర్శి బిళ్ళా రాజా రమేష్ అన్నారు. వినుకొండ నివాసి, సామాజికవేత్త, రక్తదాతగా పేరు గాంచిన పీవీ సురేష్ కు ప్రతిష్టాత్మక వరల్డ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ వారిచే గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా మహాత్మా బాపూజీ గాంధీ జయంతిని పురష్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు పీవీ సురేష్ మిత్ర మండలి ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ మిత్రులు అంబటి వెంకటేశ్వర్లు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు గ్రంథాలయం నందు జాతి పిత మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలలో భాగంగా గ్రంథాలయ అధికారి జి.శ్రీని వాసరావు వారి చిత్రపటాలకు పూలమా లలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర-దుర్గి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో బుధవారం మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కుని గాంధీ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట లో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు నినదించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక పిలుపుమేరకు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఉక్కు సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షలను ఉద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగురు కృష్ణమూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కేంద్ర ప్రభుత్వం కుట్రలో భాగమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు, మంత్రులు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో పొంతనలేని ప్రకటనలు చేస్తూ కార్మికులను అయోమయానికి గురి చేస్తున్నారని, ఇప్పటికే 4000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, మరో 2500 మంది రెగ్యులర్ ఉద్యోగులను టీఆర్ఎస్ ద్వారా ఇంటికి పంపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని పురాణాలు పోయినా ప్రైవేటీకరణను ఒప్పుకోమని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం గత 1325 రోజులుగా కార్మికులు పోరాటాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు పెద్ద ఎత్తున కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక పిలుకు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘాలు దీక్షలు చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. దీక్ష శిబిరంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్ కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్‌తో పాటు పలువురు నాయకులు సిఐటియు కార్మిక సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ ప్రారంభం

నిరసన వ్యక్తం చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని చైతన్య లిటిల్స్, సాయి వికాస్ స్కూల్‌లో పబ్లిక్ హాలిడే అయినప్పటికీ పాఠశాలకు సెలవు ఇవ్వకుండా విద్యార్థులకు నిబంధనలకు విరుద్ధంగా స్కూలు నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు పల్నాడు జిల్లా డీఈవో, చిలకలూరిపేట ఎంఈఓలకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడం జరిగింది. కానీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో చైతన్య లిటిల్స్ పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గాంధీ జయంతి రోజు సైతం విద్యార్థులకు సెలవు ప్రకటించకుండా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహిస్తున్న వారి పాఠశాల ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు ఎం.సాయి నాయక్, కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు హేమంత్, మధు, షేక్ యాసిన్, సన్నీ, చెర్రీ, హర్ష, గోపి, వికాస్, మనోహర్, లలిత్, సాహిత్, మనీ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు పున:ప్రారంభం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : మండల పరిధిలోని కోయవారిపాలెం, తిమ్మాపురం, గనికపూడి పంచాయతీల నందు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లను పునఃప్రారంభించారు. అనంతరం గొట్టిపాడు క్లాప్ మిత్రాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు మల్లేశ్వరరావు (కోయవారి పాలెం సర్పంచ్), కల్లూరి శ్రీనివాసరావు (తిమ్మాపురం సర్పంచ్), షేక్ మహమ్మద్ (గనికపూడి సర్పంచ్), మర్యాదని(గొట్టిపాడు సర్పంచ్), గోట్టిపాడు ఎంపీటీసీ-1, మధుసూదనరావు ఎంపీటీసీ కోయవారి పాలెం, వార్డు మెంబర్ వెంకట సుబ్బారావు(గనికపూడి వార్డు సభ్యులు)ఎంపిడిఓ శివపార్వతి, ఈఓ పీఆర్ఆర్‌డీ షేక్ ఖాజా, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు (పంచాయతీ కార్యదర్శి) శ్వేత (కోయవారిపాలెం) సురేష్ (తిమ్మాపురం) ప్రతిమ (గనికపూడి), ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఇన్‌ఛార్జ్ ఏపీఓ వలి, బదూరుల్లా, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

అనుమానస్పదంగా వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కారంపూడి : మండలంలోని పేటసన్నెగండ్ల తండాకు చెందిన వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం బాణావతు గోపినాయక్(34) అనే వ్యక్తి పోలం పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో బాధపడుతుండగా తల్లిదండ్రులు గుంటూరు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. చికిత్స అనంతరం యింటికి వచ్చే క్రమంలో గోపినాయక్ మృతి చెందాడని తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు విలేకర్లతో మాట్లాడుతు తన కుమారుడిని కోడలే మద్యంలో గడ్డిమందు కలిపి యిచ్చిందని ఆరోపించారు. తమ కోడలికి, వేరే వ్యక్తికి అక్రమ సంబంధం ఉందని వారు ఆరోపించారు. ఈ క్రమంలోనే తన కుమారుడికి మద్యంలో గడ్డిమందు కలిపి యివ్వడం వలన చనిపోయాడన్నారు. గుంటూరు ప్రవైటు వైద్యశాలలో రక్త పరీక్షలు చేశారని, అక్కడి రిపోర్టులో రక్తంలో గడ్డిమందు కలిసినట్లు వచ్చిందన్నారు. తన కోడలే తమ కుమారుడి మృతికి కారణమన్నారు. తమ కుమారుడికి ముగ్గురు చిన్న పిల్లలున్నారన్నారు. వారి ఆలనాపాలనా ఎవరు చూడాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కారంపూడి సిఐ టివి శ్రీనివాసరావు మాట్లాడుతు మృతదేహానికి పోస్టుమార్టం చేయించామని పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి: సీపీఐ

విశాలాంధ్ర-ఈపూరు : మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో సీపీఐ నాయకులు సూరే అప్పారావు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, గాంధీజీ దేశానికి స్వాతంత్రం తెచ్చిన పోరాట యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీజయంతి

విశాలాంధ్ర - కారంపూడి : స్థానిక సెయింట్‌జాన్స్ పాఠశాలలో గాంధీజయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు సర్వమత ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఫాదర్ అనిల్‌కుమార్ మాట్లాడుతు గాంధీ జీవితం ఆదర్శనియమన్నారు. గాంధీ సూచనలు అందరూ ఆచరించదగినవన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిసోమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం, అన్ని ప్రభుత్వ, ప్రవేట్‌పాటశాలల నందు గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

రేపు మరో గబ్బిలం పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో శుక్రవారం ఉదయం 10 గంటలకు గంగవరపు సునీత రచించిన మరో గబ్బిలం పుస్తకం ఆవిష్కరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రముఖ సాహితీ విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఆయనలో సాహితీ విమర్శులు, కవులు ఆదూరి వెంకటరత్నం, పొనుగోటి కృపాకర్, విడదల సాంబశివరావు, బద్ధిపూడి జయరావు, పొత్తూరు సీతారామరాజు, దుగ్గన పల్లి ఎజ్రాశాస్త్రి, నూకతోటి రవికుమార్, ఉసురుపాటి బ్రహ్మయ్య, డాక్టర్ పీవీ సుబ్బారావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

విశాఖ ఉక్కు రక్షణకై ప్రదర్శన

విశాలాంధ్ర-దాచేపల్లి: భారత కిసాన్ యూనియన్ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు కర్మాగారం రక్షణకు బుధవారం దాచేపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. నారాయణపురం మీదుగా స్థానిక కొట్ల బజారునకు నాయకులు చేరుకొని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరాలపాటి జానీ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనను నిలిపి వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గురుకులంలో పార్ట్ టైం సిబ్బంది తొలగింపు

విశాలాంధ్ర-యద్దపాడు : మండలంలోని వంకాయలపాడు పంచాయతీ శివారు బోయపాలెం గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు పార్ట్ టైమ్ సిబ్బందిని తొలగించినట్లు జిల్లా కోఆర్డినేటర్ పద్మజ ఆదేశించినట్లు తెలిపారు. గత నెల 23న పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 72 విద్యార్థులు దాదాపు మొత్తం గోడ దూకి పారిపోవడం, 35 మందిని అప్పుడే పట్టుకోవడం, కొద్దిసేపటికి యద్దపాడు ఎస్ఐ ఆధ్వర్యంలో మిగిలిన విద్యార్థులను రప్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్న యాజమాన్య హామీతో తిరిగి విద్యార్థులు పాఠశాలకు చేరుకున్న విషయం విధితమే. ఈ సందర్భంగా విచారణకు త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను కొందరు రెచ్చగొడు తున్నట్లు సమగ్ర విచారణలో తేలిందని, వారిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్ట్ టైమ్ సిబ్బంది జి.నవీన్ కుమార్, ఎస్.అశోక్, కె.రమేష్, డి.స్వర్ణ రాజు, ఎస్కే వాలి అహమ్మద్‌లను తొలగించారు.

మద్యం షాపల టెండర్లకు 9 వరకు గడువు : సీఐ

విశాలాంధ్ర-మాచర్ల: మద్యం షాపుల టెండర్ దారులు ఈనెల 9 లోపు దరఖాస్తు చేసుకోవాలని మాచర్ల ఎక్సైజ్ సీఐ ఎన్ వెంకటరమణ తెలిపారు. బుధవారం ఎక్సైజ్ సీఐ వెంకటరమణ విలేకరులతో మాట్లాడుతూ మాచర్ల టౌన్ 3, రూరల్ 2, వెల్దుర్తి 3, దుర్గి 2 రెండు షాపులకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పాపులేషన్‌ను బట్టి మాచర్ల, మండల పరిధిలోని షాపులకు రు.65 లక్షలు, వెల్దుర్తి, దుర్గి మండలాల పరిధిలోని షాపులకు రూ.55 లక్షలు కట్టవలసి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 9 వరకూ జరుగుతుందని, దరఖాస్తుదారులు రు.2లక్షలు డిపాజిట్ తొ మాచర్ల ఎక్సైజ్ పిఎస్ ను సంప్రదించాలన్నారు.

రేపు పిడుగురాళ్లలో 2కె రన్

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ పిడుగురాళ్ల శాఖ ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించనున్నట్లు బ్రాంచ్ మేనేజర్ ఎ.వి.పి అజయ్ కుమార్ తెలిపారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ మార్గదర్శకాల మేరకు జాగరూకత అవగాహన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు పిడుగురాళ్ల పట్టణంలోని సితార రెస్టారెంట్ వద్ద నుండి పిల్లుట్ల రోడ్ జంక్షన్ వరకు 2కె రన్ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. అవినీతి నిర్మూలన యొక్క ప్రాముఖ్యత, జవాబుదారీ తనంతో కూడిన సేవలను పొందడానికి పౌరులకు గల హక్కులపై అవగాహన కలిగించే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9100910436 నెంబరుకు తమ పేరు, వివరాలు వాట్సాప్ ద్వారా పంపవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

బీజేపీ నేతల స్వచ్ఛ భారత్

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : 'జాతిపతి గాంధీ జయంతి, మాజీ ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్రిల' జయంతి సందర్భంగా ప్రత్తిపాడులో బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద రోడ్లు శుభ్రం చేసి, జాతీయ నాయకుల విగ్రహాలను కడిగారు. వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద..పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహాలకి పూలమాలలు వేశారు. మండల అధ్యక్షుడు కఠారి దత్తప్రసాదు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ దర్శనపు శ్రీనివాసరావు, పి. వెంకట శివయ్య, నార్ల శ్రీనివాసరావు, జి.అప్పారావు, బీ.వీ. రమణారెడ్డి, మట్టా వెంకటేశ్వర్లు, మొవ్వా సాంబశివరావు, మొవ్వ రామచంద్రరావు, ఈద శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో వాడవాడలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబులు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా గాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పట్టణంలోని కొండవీడు ఈఎన్టి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆసుపత్రిలో గాంధీ జయంతి సందర్భంగా ఉచిత ఈఎన్‌టి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

అసెంబ్లీలో తీర్మానం చేయాలి

సొంత గనులు కేటాయించి సెయిల్‌లో విలీనం చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాల ఐక్యవేదిక నిరసన దీక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖపట్నం స్టీల్ పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ సమితి, కార్మిక, రైతు సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా బుధవారం కేంద్ర కార్మిక, రైతు సంఘాల అధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టారు. దీనిలో భాగంగా కడప నగరంలోని గాంధీ బొమ్మ ఎదురుగా చేపట్టిన నిరసన దీక్షలను ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు ప్రారంభించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ఏపీ రైతు సంఘాల జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి. జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి తదితరులు శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేసి... దాని అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రైవేటీకరణ ఆపాలని 1315 రోజులుగా విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోనూ పోరాటం సాగిస్తున్నా... ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెడుతూ మోదీ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకే ఫ్యాక్టరీని ధారదత్తం చేయడానికి కంకణం కట్టుకొని 'పొమ్మనకుండా పొగపెట్టే' పనులు చేస్తున్నదని విమర్శించారు. మూడు బ్లాస్ట్ ఫర్నీసులకుగాను రెంటిని మూతపెట్టి, వీఆర్ఎస్, డిప్యూటేషన్ పేరుతో వేలాది మంది ఉద్యోగులను బయటికి నెట్టే ప్రక్రియ ప్రారంభించారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రక్కనే ఉన్న గంగవరం పోర్టులో కోట్ల టన్నుల కొద్దీ నిల్వ ఉన్న కోకింగ్ కోల్‌ని ఫ్యాక్టరీకి చేరకుండా అడ్డుకోవడం ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనన్నారు. ప్రైవేటు ఉక్కు ఫ్యాక్టలకు సొంత గనులు కేటాయించి, లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ అధ్వర్యంలోని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి మాత్రం గనులు కేటాయించడం లేదన్నారు. మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేటీకరణ పనుల్ని మరింత వేగవంతం చేస్తున్నదని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడం ద్వారా దీనిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను తక్షణం నిలుపుదల చేసి, సొంతగనులు కేటాయించాలని, విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో విలీనం చేసి... ఫ్యాక్టరీకి అవసరమైన ముడిసరుకులు కేటాయించాలని, పరిశ్రమను పూర్తి సామర్థ్యంతో నడపాలని, ఉద్యోగస్థుల తొలగింపు ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ నిలుపుదల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవాలని, ట్రేడ్ యూనియన్లతో కూడిన అఖిలపక్ష ప్రతినిధి వర్గాన్ని ప్రధాన మంత్రి దగ్గరికి తీసుకు వెళ్లాలని కోరారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన కడప ఉక్కు కర్మాగారం పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నేతలు వేణుగోపాల్, బాదుల్లా, రామలింగారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపేంత వరకు పోరాటాలు: రవీంద్రనాథ్

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ యత్నాన్ని నిలుపుదల చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉధృతంగా పోరాటాలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఐక్యవేదిక అధ్వర్యంలో విజయవాడలో రెండోరోజూ నిరాహార దీక్షలు కొనసాగాయి. ధర్నాచౌక్ వద్ద దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన రవీంద్రనాథ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకమని బూటకపు మాటలు చెపుతూ మరోపక్క ప్రైవేటీకణ విధానాలను కొనసాగిస్తున్నాయని మండిపడ్డారు. ప్రైవేటీకరణలో భాగంగానే 4290 మందిని ఒక్క కలం పోటుతో తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ఇకనైనా కేంద్రర కుట్రలు ఆపి, పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేసి పూర్తిసామర్థ్యంతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షల్లో రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ కేంద్ర కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.రామకృష్ణ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ వైఖరి స్పష్టం చేయాలి: జేవీఎస్ మూర్తి

ఎన్నికల సమయంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్...ఇప్పుడు ఎందుకు కేంద్ర ప్రభుత్వాన్ని అడగడం లేదో చెప్పాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి నిలదీశారు. విశాఖ ఉక్కు సమస్య ఒక్క కార్మికులదే కాదని, ఇది రాష్ట్ర ప్రజలందరి సమస్య అని అన్నారు. ఉక్కును కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటాలకైనా కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ద్రవిడ విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య కేఎస్ చలం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం తదితరులు మాట్లాడుతూ పోరాటాలు చేసి ప్రభుత్వ రంగంలో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడితే చూస్తూ ఊరుకొనేది లేదని హెచ్చరించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇంటక్ తదితర కార్మిక సంఘాలు ఐక్య వేదిక నాయకులు జె.అచ్యుతరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.నాగభూషణం, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ మసేన్, ఎం.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కుట్రలు ఆపాలి: జంగాల

విశాఖ ఉక్కు... ఆంధ్రుల సొత్తు అని కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్రానికి తలమానికమైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే కుట్రలు ఇక ఆపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నేటి ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర కార్మిక సంఘాల అధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ వద్ద రెండో రోజు బుధవారం సత్యాగ్రహ దీక్షలు కొనసాగించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్, సీఐటీయూ నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకులు కూరపాటి కోటయ్య నాయకత్వాన జరిగిన దీక్షలను అజయ్‌కుమార్ ప్రారంభించారు. వివిధ ప్రజా సంఘాల నేతలు సంఘీభావం తెలియజేశారు.

పాట్నాలోని గాంధీ ఘాట్ వద్ద జాతిపిత బాపూజీకి నివాళి అర్పిస్తున్న సీపీఐ కార్యదర్శి కె.నారాయణ

గాంధీజీ సమతావాదమే దేశానికి రక్ష

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర- విజయవాడ: మహాత్మా గాంధీ ప్రబోధించిన సమతావాదమే భారతదేశానికి రక్షణ కల్పిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతిని పుస్కరించుకుని సీపీఐ విజయవాడ నగర సమితి అధ్వర్యాన వన్‌టౌన్‌లోని గాంధీ పార్కులో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ మన దేశంలో అన్ని

కులాలు, మతాలు సమైక్యంగా జీవించటానికి గాంధీజీ సూచించిన సమతావాదం సరైందన్నారు. స్వాతంత్ర్య వచ్చిన 70ఏళ్ల తరువాత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని వారు, గాంధీజీ ఆశయాలను మంటగలిపిన వారు కేంద్రంలో అధికారంలోకి వచ్చి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ వంటి మతోన్మాద శక్తులు అనేక మంది సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తున్నారని చెప్పారు. కొంతమంది సినీనటులు సహా సనాతన ధర్మం గురించి ఏ మాత్రం తెలియని వారు కూడా ప్రచారం చేస్తున్నారన్నారు. అణగారిన వర్గాలను, మహిళలను కించపర్చే రీతిగా సనాతన ధర్మం ఉంటుందన్నారు. మన దేశంలో భిన్న కులాలు, మతాలు, వివిధ భాషలు మాట్లాడేవారు కలిసి ఉండటానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం, గాంధీజీ సమతావాదమే కారణం అన్నారు. సనాతన ధర్మం దేశానికి అరిష్టం అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవటానికి, లౌకికవాదాన్ని రక్షించటానికి గాంధీ చూపిన మార్గం అనుసరణీయమని తెలిపారు. గాంధీజీ స్ఫూర్తితో దేశాన్ని, రాజ్యాంగాన్ని, లౌకికతత్వాన్ని కాపాడటం కోసం ప్రజలు నడుం కట్టాలని కమ్యూనిస్టు పార్టీ తరపున రామకృష్ణ పిలుపునిచ్చారు. ముందుగా పార్కులోని మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు బుట్టి రాయప్ప, తాడి పైడియ్య, కొట్టు రమణారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, కోశాధికారి ఎం.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

7న పలస్తీనా సంఘీభావ దినం

10 వామపక్ష పార్టీల ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గాజాపై ఇజ్రాయిల్ ఆటవిక దాడులు మొదలు పెట్టి ఏడాది అవుతున్న సందర్భంగా తక్షణమే ఈ యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ జరిపి ఘర్షణలకు స్వస్తి పలకాలని కోరుతూ ఈనెల 7న సంఘీభావ దినంగా పాటించాలని 10 వామపక్ష పార్టీలు ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు గురువారం వామపక్ష పార్టీల నేతల నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు వై.సాంబశివరావు-సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ, జాస్తి కిశోర్‌బాబు-సీపీఐ(ఎంఎల్), కాటం నాగభూషణం-ఎంసీపీఐ(యూ), ఎన్.మూర్తి-సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, బీఎస్ అమర్‌నాథ్-ఎస్‌యూసీపీఐ(సీ), పీవీ సుందరరామరాజు-ఫార్వర్డ్ బ్లాక్, జానకిరాములు- రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ దాడికి ప్రతీకారం పేరుతో పలస్తీనాపై ఇజ్రాయిల్ విచక్షణారహితంగా క్రూరమైన దాడులకు దిగిందని, ఫలితంగా 42 వేల మందికి పైగా పలస్తీనా ప్రజలు మరణించారని వివరించారు. వారిలో మహిళలు, చిన్నారులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. వాస్తవానికి ఈ సంఖ్య ఆగస్టు 6 నాటికి 85 వేలకు పైగా ఉండవచ్చని ప్రముఖ మెడికల్ జర్నల్ లాన్సెంగ్ అంచనా వేసిందని, ఇందులో ప్రత్యక్ష, పరోక్ష మరణాలు రెండూ ఉన్నాయని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాద చర్యలు జాతి నిర్మూలనకు దారితీస్తుందని ఈ ఏడాది జనవరిలో అంతర్జాతీయ న్యాయస్థానం వ్యాఖ్యానించిందన్నారు. కాల్పుల విరమణ కోసం కొనసాగుతున్న అర్థవంతమైన చర్చలను ఇజ్రాయిల్ తొక్కేస్తూ మరోవైపు ఏడాది పొడవునా దాడి కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోత, రాక్షసత్వాన్ని నిరసిస్తూ తక్షణమే యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ అమలు చేయాలని 10 వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. పలస్తీనాకు సంఘీభావంగా ఈ నెల 7వ తేదీన రాష్ట్రవ్యాపితంగా ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించాలని, తమ పిలుపును జయప్రదం చేయాలని ప్రజలకు వామపక్ష పార్టీల నేతలు విజ్ఞప్తి చేశారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఐక్య పోరాటాలు: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిల అధ్వర్యంలో 'మహాత్మా బీజేపీ ఫాసిస్ట్ శక్తుల నుండి ఈ దేశాన్ని కాపాడు' అనే నినాదంతో డీసీసీ అధ్యక్షులు అద్దాల వెంకట వర్మ రాజు అధ్యక్షతన జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్ద గాంధీజీ జయంతి కార్యక్రమం నిర్వహించి... నివాళులు అర్పిం చారు. బీజేపీ విభజించు పాలించు విధానం పై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... పోరాటాలు, ప్రాణ త్యాగాలతో ఏర్పడిన ఈ స్టీల్ ప్లాంట్ ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందని, ఈ పోరాటంలో కాంగ్రెస్ ముందుం టుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరా గాంధీ శంకుస్థాపన చేసి, పీవీ నరసింహ రావు జాతికి అంకితం చేస్తే, మన్మోహన్ సింగ్ సర్కార్ ఈ ప్లాంట్ విస్తరణకు కృషి చేసిందని ఆమె తెలిపారు. విశాఖ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, ఆంధ్రుల ఆత్మగౌరవంగా భావించే ఉక్కు పరిశ్రమలో 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు నోటీసు ఇవ్వడం, గుర్తింపు కార్డులు రద్దు చేయడం దారుణమని, ఇప్పటికే వారికి 5 నెలల నుండి జీతాలు ఇవ్వడం లేదని, వారు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని షర్మిల అన్నారు, తరువాత ఆమె స్టీల్ ప్లాంట్ కి వెళ్లి రోడ్డు మీద బైఠాయించి రాస్తా రోకో చేశారు. బాధిత కార్మికులకు అండగా ఉంటానని రాష్ట్ర ముఖ్యమంత్రి కాంట్రాక్టు కార్మికులకు 48 గంటలలో భరోసా ఇవ్వకపోతే అక్టోబర్ 4 మధ్యాహ్నం 1 గంటకు నిరాహార దీక్షకు దిగుతానని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు వేగి వెంకటేష్, పీసీసీ ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ నాయకులు కేవీఎస్, సోడాదాస్ సుధాకర్, సత్యా రెడ్డి, ప్రియాంక దండి, గుత్తుల శ్రీనివాస్, కేవీ లక్ష్మి,చిన్న బాబు, సంతోష్,గంగాధర్, ఆలీ, కస్తూరి వెంకట్ రావు,యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు,జిల్లా అధ్యక్షులు సతీష్, శివకుమార్, మణికంఠ పాల్గొన్నారు.

లడ్డూ వివాదానికి మతం రంగు పులుముతారా?

షర్మిల మీడియాతో మాట్లాడుతూ... తిరుమల లడ్డూ విషయంపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే ఈ వ్యవ హారంపై కేంద్రం ప్రభుత్వం దర్యాప్తు చేయించాలని సూచించినట్లుగా ఉంద న్నారు. తిరుమల లడ్డూ విషయంలో సీబీఐ దర్యాప్తు వెయ్యాలని అందరికంటే ముందు కాంగ్రెస్ పార్టీ అడిగిం దన్నారు. ఒకరేమో శాంతి పూజలు అంటు న్నారు. మరొకరేమో పశ్చాత్తాప దీక్షలంటు న్నారు. ఇంకొకరేమో ప్రక్షాళన పూజలు అంటున్నారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్క పేరు పెట్టుకొని ఈ విషయానికి మతం రంగు పూయడం సరికాదని పేర్కొన్నారు.

రేపు విశాఖ ఉక్కుపై రౌండ్‌టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయమంటూనే హఠాత్తుగా 4290 మంది ఒప్పంద కార్మికుల తొలగింపు ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో అక్టోబరు 4వ తేదీన రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యాలయ ప్రతినిధి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని దాసరి భవన్ నందు శుక్రవారం ఉదయం 10గంటలకు ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలతో పాటు ఇతర రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

విజయవాడలో కుండపోత వర్షం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయ వాడ నగరంలో బుధవారం మధ్యా హ్నం ఉరుములు మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. రహదారులపై పెద్ద ఎత్తున నీరు చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెట్లు పడిపోవడంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనేక ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. పిడుగు పాటుకు ట్రాన్స్ ఫారాలు దెబ్బతిన్నాయి. చుట్టుగుంట ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్దరణకు అయిదారు గంటల సమయం పట్టింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో ఆ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు తొలగించడానికి వీఎంసీ సిబ్బంది రంగంలోకి దిగారు. భారీ వర్షం కారణంగా ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల పనులకు అంతరాయం ఏర్పడింది.

ఆర్‌టీపీపీ అధికారుల అక్రమాలు

భూ నిర్వాసితులకు దక్కని ఉద్యోగాలు

ఓబులేసు తీవ్ర విమర్శ

విశాలాంధ్ర-కడప రూరల్: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు అధికారులు చట్టాలు ఉల్లంఘిస్తున్నారని, ప్రభుత్వ ఉత్తర్వులను, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు విమర్శించారు. నిబంధనలకు నీళ్లొదిలి భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించకుండా... అధికార పార్టీకి కొమ్ముకాస్తూ... వారు చెప్పిన వారికి ఉద్యోగాలు ఇచ్చారని, ఈ అక్రమ నియామకాలపై విచారణ చేపట్టాలని ఓబులేసు డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో ఓబులేసు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం రైతులు భూమి ఇచ్చారని, అందుకు పరిహారంగా 50 శాతం ఉద్యోగాలు భూ నిర్వాసితులకు ఇవ్వాలని స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఆర్‌టీపీపీ అధికారులు ఇష్టానుసారం వ్యవహరించారన్నారని మండిపడ్డారు. కోర్టు ఆదేశాలను సైతం అధికారులు ధిక్కరించారన్నారు. అధికారులు నిస్సిగ్గుగా అధికార పార్టీ నాయకులకు పాదపూజ చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులకు కొమ్ము కాస్తూ వారు చెప్పిన, ఇచ్చిన జాబితా ప్రకారం అక్రమ నియామకాలు చేపడుతున్నారని చెప్పారు. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో జరిగే అవినీతి, అక్రమాలు, అక్రమ నియామకాల గురించి ఇంధనశాఖ కార్యదర్శి విజయానంద్‌కు తెలిసినప్పటికీ చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఆయన కూడా అవినీతి, అక్రమాలలో పాలుపంచుకుంటున్నారని ఆరోపించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆర్‌టీపీపీని తన చెప్పుచేతుల్లో పెట్టుకున్నారని, తన కార్యకర్తలను, అనుచరులను ఉద్యోగులుగా చేర్చాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ అక్రమాలపై విచారణ చేస్తామని కూటమి సర్కారు చెబుతోందని, ఇప్పుడు జరుగుతున్న అక్రమాలపై ఎందుకు విచారణ చేపట్టడం లేదని ఓబులేసు ప్రశ్నించారు. భూమి కోల్పోయి అర్హత గల 159 మందికి ఇంకా ఉద్యోగాలు రావాల్సి ఉందని, వారికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, నగర కార్యదర్శి ఎస్ వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు

తొలి రోజు 9 గంటల నుంచి దర్శనాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : బెజవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభకానున్నాయి. మొదటి రోజు ఉదయం 9 గంటల నుంచి దర్శనాలను ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈవో కె.రామారావు ప్రకటించారు. 10 రోజులు కనకదుర్గాదేవి 10 అవతారాలలో భక్తులకు దర్శనం ఇస్తారని వెల్లడించారు. ఇప్పటికే దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాల కోసం లేజర్ షో, కృష్ణమ్మ నదికి హారతి కార్యక్రమం ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించునేందుకు సుమారు 12 లక్షల నుంచి 15 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇంద్రకీలాద్రి ముస్తాబయింది. ఖడ్గమాల ప్రత్యేక కుంకుమర్చన కూడా జరగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు చండీయాగం జరుగుతోంది. అంతేకాకుండా భక్తులకు పరోక్ష సేవలు కూడా అందుబాటులో ఉనాయి. ఈనెల 12వ తేదీ తెప్పోత్సవం నిర్వహిస్తారు. అమ్మవారి అంతరాలయం దర్శనాలు రద్దు చేశారు. రూ.300, రూ.500 టికెట్, ఉచిత దర్శనం, ప్రసాదాల కౌంటర్లు, భక్తులు దర్శనం కోసం వచ్చే అన్ని క్యూ లైన్లలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. వృద్ధులకు, వికలాంగులకు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు అమ్మ వారి దర్శనం కల్పించ నున్నారు. ప్రముఖులు కోసం ప్రోటోకాల్ దర్శనం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల సమయాన్ని నిర్దేశించారు. సీతమ్మపాదాల వద్ద కేశఖండన శాల ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఇప్పటికే భక్తుల కోసం 150 మరుగుదొడ్లు వీఎంసీ సహాయంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. 250 సీసీ కెమేరాలతో దసరా ఉత్సవాల్లో నిఘా ఉంటుందన్నారు. భక్తులకు అందజేయడానికి 25 లక్షల లడ్డూలు తయారు చేస్తున్నామన్నారు. లిఫ్ట్ మార్గాలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా 17 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఉచిత ప్రసాద వితరణ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.